


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 264 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల గురువారం 28 మే 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 264 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA THU 28 MAY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## చంద్రబాబును ఎదుర్కోవాలి.. ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరాలి

## స్థానిక ఎన్నికలపై జగన్ ఫోకస్

- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు జగన్ పిలుపు
- ఏకగ్రీవ ఎన్నిక జరిగితే నియోజకవర్గ ఇంఛార్జి వైఫల్యంగా పరిగణిస్తానని హెచ్చరిక
- ప్రభుత్వ వైఫల్యాలపై 'వెన్నుపోటు రెండేళ్లు' బుక్‌లెట్‌ను ఇంటింటా పంచాలని ఆదేశం
- ఎస్సీలు బలంగా ఉన్నచోట వారినే అభ్యర్థులుగా నిలపాలని సూచన
- ప్రతిచోటా పోటీ చేసి వైసీపీ జెండా ఎగరేయాలని నేతలకు దిశానిర్దేశం

- మిగతా 2లో



## ఆఫ్‌లైన్ అయినా, హైబ్రిడ్ మోడల్ అయినా టీమ్ 11 కి బ్యాటింగ్ తప్పదు

### మహానాడులో నారా లోకేశ్

- హైబ్రిడ్ మోడల్ లో మహానాడు అనగానే టీమ్ 11 సంబరాలు చేసుకున్నారంట అంటూ ఎద్దేవా
- దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసింది ఎన్టీఆర్ అని కితాబు
- రాజకీయాల్లో ఎన్టీఆర్ ట్రెండ్ సెట్ చేశారని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:మహానాడు ప్రారంభం సందర్భంగా టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్ ప్రత్యర్థి పార్టీపై విమర్శనాస్త్రాలు సంధించారు. హైబ్రిడ్ విధానంలో మహానాడు జరుగుతున్నప్పటికీ టీమ్ -11 కి బ్యాటింగ్ తప్పదని వార్నింగ్ ఇచ్చారు. "ఆఫ్‌లైన్ అయినా, ఆన్‌లైన్ అయినా, హైబ్రిడ్ అయినా మహానాడు మాస్ జాతర సూపర్ హిట్. పసుపు పండుగ మహానాడు. ప్రతి కార్యకర్త కాలర్ ఎగరేసి నేను తెలుగు వాడిని, నాది తెలుగుదేశం పార్టీ అని చెప్పుకునే వేదిక మహానాడు. నేషన్ ఫస్ట్ అనేది తెలుగుదేశం పార్టీ విధానం. మన దేశం - మన బాధ్యత. ప్రధాని మోదీ సూచించిన మార్గాన్ని మనం ఫాలో అవుతున్నాం. నెల్లూరులో భారీగా మహానాడు నిర్వహించాలనుకున్నాం.

- మిగతా 2లో




వివరాలు 2లో..

## ఆడబిడ్డల వల్లే విజయం.. ఇది మహిళా మహానాడు

- ఇటీవలి విజయాన్ని దృష్టిలో ఉంచుకుని మహానాడును మహిళలకు అంకితం చేస్తున్నామన్న చంద్రబాబు
- 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తున్నామని వెల్లడి
- ఏఐ, ఏరోస్పేస్ వంటి రంగాలతో ఏపీని గ్లోబల్ టెక్ హబ్‌గా మారుస్తామని హామీ
- మెగా డీఎస్సీ, పోలీస్ నియామకాలతో యువతకు ఉద్యోగ భరోసా కల్పించామన్న సీఎం
- వచ్చే ఎన్నికల కోసం కాదు, భావితరాల కోసమే తమ ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టీకరణ

- మిగతా 2లో



## ఎబోలా ముప్పు: భారత్‌లో లేదు.. కానీ నిఘా తీవ్రం!

- బెంగళూరు అనుమానిత వ్యక్తికి నెగెటివ్
- విమానాశ్రయాల వద్ద ముమ్మరంగా స్క్రీనింగ్
- ఆఫ్రికాలో వేగంగా పెరుగుతున్న బుండిబుగ్యో కేసులు
- కాంగోలో వందలాది అనుమానిత మరణాలు
- నిఘా పెంచినట్లు తెలిపిన కేంద్ర ఆరోగ్యశాఖ

పెన్ పవర్ డెస్క్:ఆఫ్రికా దేశాల్లో వేగంగా విస్తరి స్తున్న ఎబోలా వైరస్ మహమ్మా రిపై కేంద్ర ప్రభుత్వం అప్రమ త్తమైంది. దేశంలో అధికారికంగా

- మిగతా 2లో



## డేటా సెంటర్ల హబ్‌గా భారత్.. ఆసియా-పసిఫిక్‌లో రెండో స్థానం.. హైదరాబాద్ అరుదైన ఘనత

- ఆసియా-పసిఫిక్‌లో రెండో అతిపెద్ద డేటా సెంటర్ మార్కెట్‌గా భారత్
- ప్రస్తుతం 1.6 గిగావాట్ల సామర్థ్యం.. నిర్మాణంలో మరో 3.1 గిగావాట్లు
- ముంబైతో పాటు హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ వంటి నగరాలు వృద్ధిలో కీలకం
- ఆసియా-పసిఫిక్‌లో హైదరాబాద్‌ను టాప్ సెకండరీ మార్కెట్‌గా గుర్తించిన నివేదిక

- మిగతా 2లో





## ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలకు ప్రధాని మోదీ కీలక సూచనలు

- నిత్యం తగినంత నీరు తాగాలన్న ప్రధాని నరేంద్రమోదీ
- వీలైనంత వరకు మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లవద్దని సూచన
- వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయవద్దని సూచన

పెన్ పవర్ డెస్క్:దేశంలోని చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు కీలక సూచనలు చేశారు. తీవ్రమైన వేడి పరిస్థితుల్లో పలు జాగ్రత్తలు సూచించారు.

- మిగతా 2లో

## ప్రధాని మోదీతో 20 నిమిషాలు సీఎం విజయ్ భేటీ.. పలు విజ్ఞప్తులు



- నెదర్లాండ్స్ నుంచి రాగి ఫలకాలను తీసుకువచ్చినందుకు మోదీకి విజయ్ థ్యాంక్స్
- కర్ణాటకకు మేకెదాటు ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వకూడదని విజ్ఞప్తి
- ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభంలో రాష్ట్ర గీతాన్ని ప్లే చేయడానికి అనుమతించాలన్న సీఎం

- మిగతా 2లో

## ఓటరు జాబితాలో పేరు లేకపోతే పౌరసత్వం పోయినట్లు కాదు

- ఈసీ పరిధి కేవలం ఎన్నికల వరకే
- తొలగించిన పేర్లను కేంద్రానికి పంపాలని ఆదేశం
- హోం శాఖ ఆధ్వర్యంలో పౌరసత్వ విచారణ
- పౌరులని తేలితే ఓటు హక్కు పునరుద్ధరణ



పెన్ పవర్ డెస్క్:ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను సమర్థించిన సుప్రీంకోర్టు పౌరసత్వంపై కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ ప్రక్రియపై దాఖలైన పిటిషన్లపై బుధవారం విచారణ జరిపిన న్యాయస్థానం ఓటరు జాబితా నుంచి వ్యక్తి పేరు తొలగించినంత మాత్రాన పౌరసత్వం రద్దయినట్లు కాదని స్పష్టం చేసింది. ఎన్నికలకే పరిమితంచీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలకు ప్రధాని మోదీ కీలక సూచనలు

- మొదటి పేజి తరువాయి

నిత్యం తగినంత నీరు తాగాలని అన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదిక ద్వారా ఆయన ప్రజలకు జాగ్రత్తలు చెప్పారు. వీలైనంత వరకు మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లవద్దని సూచించారు. అతి తీవ్రమైన వేడి నుంచి ప్రజలు తమను తాము కాపాడుకోవాలని అన్నారు. వృద్ధులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని తెలిపారు. సాధ్యమైనంత వరకు ఇతరులకు సహాయం చేయాలని, ఇళు,, దుకాణాల వద్ద ఆరుబయట పక్షులు, జంతువుల కోసం నీటిని ఉంచాలని కోరారు. ఎండ కారణంగా ఎవరికైనా ఏమైనా అయితే ఏం జాగ్రత్తలు తీసుకోవాలో సూచనలు చేశారు. తల తిరగడం, వికారం, అలసట వంటి వడదెబ్బ లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. చుట్టూ ఉన్నవారిలో ఎవరైనా అకస్మాత్తుగా స్పృహ కోల్పోయినట్లు అనిపించినా, నీరసించినా వెంటనే వారిని నీడ ఉన్న ప్రదేశానికి తీసుకువెళ్లాలని అన్నారు. ఇలాంటి సమయాల్లో అప్రమత్తంగా వ్యవహరించడం వల్ల ఒక ప్రాణాన్ని కాపాడుతామని పేర్కొన్నారు. అధిక ఉష్ణోగ్రతల ప్రభావం పిల్లలు, వృద్ధులు, రైతులు, కార్మికులపై ఎక్కువగా ఉంటోందని అన్నారు.

రాబోయే రోజుల్లో ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. విదర్భ, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, హర్యానా, రాజస్థాన్, బీహార్, ఒడిశా, తెలంగాణ, కోస్తా, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో తీవ్ర వడగాల్పులు వీస్తున్నాయి. మే 29 నుంచి ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే కురిసే అవకాశం ఉందని తెలిపింది.

## డేటా సెంటర్ల హబ్‌గా భారత్.. ఆసియా-పసిఫిక్‌లో రెండో స్థానం.. హైదరాబాద్ అరుదైన ఘనత

భారత డేటా సెంటర్ల మార్కెట్ అత్యంత వేగంగా విస్తరిస్తూ గ్లోబల్ డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో కీలక స్థానానికి చేరుకుంటోంది. ఆసియా-పసిఫిక్ (ఏపీఏసీ) ప్రాంతంలోనే రెండో అతిపెద్ద డేటా సెంటర్ మార్కెట్‌గా భారత్ నిలిచింది. ప్రస్తుతం దేశంలో 1.6 గిగావాట్ల కార్యాచరణ సామర్థ్యం ఉండగా.. మరో 3.1 గిగావాట్ల సామర్థ్యం నిర్మాణం, ప్రణాళిక దశల్లో ఉంది. ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టెన్సీ సంస్థ కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నేడు విడుదల చేసిన తాజా నివేదిక ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించింది. దేశంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం పెరగడం, హైపర్‌స్కేల్ క్లౌడ్ విస్తరణ, సంస్థల నుంచి డిమాండ్ అధికమవ్వడం వంటి కారణాలతో భారత్ డిజిటల్ మౌలిక సదుపాయాలకు కీలక కేంద్రంగా మారుతోందని నివేదిక పేర్కొంది. ఈ వృద్ధికి ముంబై, హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ-ఎన్సీఆర్, పుణె, బెంగళూరు వంటి నగరాలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. ఈ మార్పుపై కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ సరాఫ్ మాట్లాడుతూ.. "ప్రస్తుతం ప్రపంచ డేటా సెంటర్ రంగం వృద్ధిలో కొత్త దశకు చేరుకుంది. ఇక్కడ డిమాండ్‌తో పాటు విద్యుత్ లభ్యత, మౌలిక సదుపాయాల సంసిద్ధత, నిర్మాణ సామర్థ్యం అత్యంత కీలకంగా మారాయి" అని వివరించారు. ఈ మార్పులకు అనుగుణంగా భారత్ పటిష్ఠమైన స్థితిలో ఉందని, బలమైన డిమాండ్, విస్తరిస్తున్న డెవలప్‌మెంట్ పైప్‌లైన్, బహుళ నగరాల పర్యావరణ వ్యవస్థ దీనికి దోహదపడుతున్నాయని ఆయన తెలిపారు.

గ్లోబల్ డేటా సెంటర్ మార్కెట్‌లో హైదరాబాద్‌కు 9వ ర్యాంక్

భారత డేటా సెంటర్ల మార్కెట్‌కు ముంబై నగరం కేంద్రంగా నిలుస్తోంది. 2026 చివరి నాటికి ఈ నగరం 1 గిగావాట్ కార్యాచరణ సామర్థ్యాన్ని అధిగమిస్తుందని అంచనా. ఇక హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ ఎన్సీఆర్, పుణె వంటి ద్వితీయ శ్రేణి మార్కెట్లు కూడా ఈ వృద్ధికి గణనీయంగా దోహదపడుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోనే టాప్ సెకండరీ మార్కెట్‌గా, ప్రపంచవ్యాప్తంగా తొమ్మిదో స్థానంలో నిలిచిందని నివేదిక ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఇది డేటా సెంటర్ల ల్యాండ్‌స్కేప్‌లో హైదరాబాద్ ప్రాముఖ్యతను స్పష్టం చేస్తోంది. మరోవైపు బెంగళూరును తృతీయ శ్రేణి మార్కెట్‌గా నివేదిక వర్గీకరించింది.

భారతదేశ దీర్ఘకాలిక విస్తరణ ప్రణాళికలు కూడా ఎంతో ఆశాజనకంగా ఉన్నాయి. భవిష్యత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఆపరేటర్లు పెద్ద ఎత్తున భూములను సేకరిస్తున్నారు. ప్రస్తుతం 10.5 గిగావాట్లకు పైగా సామర్థ్యం ఇంకా భూమి దశలోనే ఉందని, ఇది రాబోయే రోజుల్లో భారీ అభివృద్ధికి సంకేతమని నివేదిక పేర్కొంది.

## చంద్రబాబును ఎదుర్కోవాలి.. ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరాలి

ఏపీలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై వైసీపీ అధినేత జగన్ పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేసే క్రమంలో నియోజకవర్గ ఇంఛార్జిలకు ఆయన తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఏ నియోజకవర్గంలోనైనా, ఏ ఒక్క స్థానంలోనైనా ఎన్నిక ఏకగ్రీవమైతే, దానిని పూర్తిగా ఆ ఇంఛార్జి వైఫల్యంగానే పరిగణిస్తానని తేల్చిచెప్పారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు, సమన్వయకర్తలు, ఇంఛార్జిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో జగన్ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికార పార్టీ కుట్రలను ఎదుర్కొని ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరేయాలని పిలుపునిచ్చారు. "ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని ఇబ్బందులు పెట్టినా కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరేయాలి. ఎక్కడైనా ఏకగ్రీవం జరిగిందంటే మాత్రం నేను చాలా సీరియస్‌గా తీసుకుంటా. ఇది మళ్లీ మళ్లీ చెబుతున్నా. అలా జరిగితే అది నియోజకవర్గ ఇంఛార్జి ఫెయిల్యూర్‌గానే భావిస్తా" అని జగన్ స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపిక, వారికి ఇవ్వాల్సిన భరోసాపై కూడా జగన్ దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఎస్సీలు బలంగా ఉన్న గ్రామాల్లో వారి నుంచే అభ్యర్థులను ఎంపిక చేయాలని సూచించారు. పోటీ చేసే అభ్యర్థులకు పార్టీ, ఇంఛార్జి అండగా ఉన్నారనే ధైర్యాన్ని కల్పించాలని, అలా చేస్తేనే అసెంబ్లీ ఎన్నికల్లో వారు మనకు అండగా నిలుస్తారని వివరించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారిని గుర్తించి, ఎన్నికల బరిలోకి దింపాలని ఆదేశించారు.

చంద్రబాబు ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని జగన్ నేతలకు సూచించారు. ఇందుకోసం 'వెన్నుపోటు రెండేళ్లు' పేరుతో రూపొందించిన బుక్‌లెట్‌ను ప్రతి ఇంటికీ చేరవేయాలని ఆదేశించారు. ప్రభుత్వ లోపాలపై ఇంటింటా చర్చ జరిగేలా చేయడం ద్వారా ప్రజలే ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరగబడతారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రచార కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని నేతలకు స్పష్టం చేశారు.

# బాదంపప్పు బాగోతాలు- 5

- అనుమానాల నీడ..?
- టౌన్ స్టేషన్‌లో నిఘా భయం?
- సొంత శాఖలోనే ఉద్యోగులపై బాదంపప్పు అనుమానాల నీడ..?
- తాడేపల్లిగూడెం టౌన్ పోలీస్ స్టేషన్‌లో అసాధారణ నిశ్శబ్దం వెనుక కారణాలేమిటి..?
- సమాచార లీకులపై బాదం పప్పు కు అంతర్గత ఆందోళన పెరిగిందా..?
- మీడియా ప్రతినిధుల ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారా..? అలా
- చేస్తే లీగల్ గా ఏం జరుగుతుందో తెలుసా..?
- అధికార వ్యవస్థలో విశ్వాస సంక్షోభం నెలకొంటోందా..?
- ప్రజల్లో వినిపిస్తున్న ప్రశ్నలకు సమాధానం ఎవరు చెబుతారు..?




**ఎడిటర్, పెన్ పవర్ భీమవరం/ తాడేపల్లిగూడెం, మే 27:**
ఒకప్పుడు క్రమశిక్షణ, పరస్పర నమ్మకానికి ప్రతీకగా నిలిచిన పోలీస్ శాఖలో ఇప్పుడు అనుమానాల మేఘాలు కమ్ముకుంటున్నాయా..? తాడేపల్లిగూడెం టౌన్ పోలీస్ స్టేషన్ చుట్టూ ఇటీవల వినిపిస్తున్న చర్చలు ఇదే ప్రశ్నను ముందుకు తెస్తున్నాయి.

స్టేషన్‌లో జరుగుతున్న అంతర్గత వ్యవహారాలు, కొంత సమాచారం బయటకు వస్తుండటంతో "ఎక్కడో లీకేజీ జరుగుతోంది" అనే అనుమానం కొందరు అధికారుల్లో పెరిగిందనే ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో సొంత సిబ్బందిపైనే నిఘా పెరిగిందని, కొందరిపై ప్రత్యేక దృష్టి పెట్టారనే చర్చలు ఉద్యోగ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

అయితే ఈ ప్రచారాల వెనుక వాస్తవం ఏమిటి..? నిజంగానే సమాచార లీకులపై ఆందోళన ఉందా..? లేక ఇది అంతర్గత విభేదాల ప్రతిఫలమా..? అనే ప్రశ్నలకు సమాధానాలు మాత్రం ఇంకా బయటకు రావాల్సి ఉంది.

ఇదే సమయంలో మీడియా ప్రతినిధుల ఫోన్ కాల్స్‌పై నిఘా ఉందనే వార్తలు కూడా చర్చనీయాంశంగా మారాయి.

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం...

ఇదే సమయంలో పెన్ పవర్ ప్రతినిధులు, ముఖ్యంగా ఈ కథనాలపై పనిచేస్తున్న జర్నలిస్టులు జాగ్రత్తగా ఉండాలని న్యాయ నిపుణులు సూచించారు.. వ్యక్తిగత గోప్యత, కమ్యూనికేషన్ భద్రత పై చట్టబద్ధ అనుమతులు లేకుండా ఎవరైనా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడితే అది తీవ్రమైన న్యాయపరమైన సమస్యలకు దారి తీసే అవకాశం ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

అధికార వ్యవస్థలో పరస్పర విశ్వాసం దెబ్బతింటే దాని ప్రభావం పరిపాలనపై పడే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ప్రజల్లో వినిపిస్తున్న ప్రశ్నలకు సంబంధిత అధికారులు స్పష్టత ఇస్తారా..? లేక ఈ అనుమానాలు మరింత పెరుగుతాయా..? అనేది వేచి చూడాల్సి ఉంది.

**ఎపిసోడ్ -15**

**ఎమ్మార్వో రాసలీలలు**

**బుజ్జి కోసం పెంటపాడు నుండి తాడేపల్లి గూడెం వస్తున్నాడా..?**

**మాన్యువల్ ఎఫ్.ఎం.సీ సంగతి ఏంటి చిలక్కొట్టుడు సునీల్..?**

**శాఖపరమైన చర్యలు ఉంటాయా..?**

**చదువుతూనే ఉండండి పెన్ పవర్... ప్రశ్నించడం మన హక్కు**

# ఆడబిడ్డల వల్లే విజయం.. ఇది మహిళా మహానాడు

**పెన్ పవర్ డెస్క్:** ఇటీవలి ఎన్నికల విజయంలో మహిళలు కీలక పాత్ర పోషించారని, అందుకే ఈ మహానాడును వారికి అంకితం చేస్తూ 'మహిళా మహానాడు'గా ప్రకటిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. వర్చువల్ విధానంలో జరిగిన మహానాడు సభలో ఆయన మాట్లాడుతూ, మహిళలు, యువత భవిష్యత్తే తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని

స్పష్టం చేశారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం 'స్త్రీ శక్తి' ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 'దీపం 2.0' కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని చంద్రబాబు వివరించారు. రానున్న రోజుల్లో 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జెన్ జీ, జెన్ ఆల్ఫా తరం ఆలోచనలకు అనుగుణంగా విధానాలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఏఐ, ఏరోస్పేస్, సెమీ కండక్టర్స్ వంటి ఆధునిక రంగాలకు ఆంధ్రప్రదేశ్‌ను చిరునామాగా మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' స్థానంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని అమలు చేస్తున్నామని, దీని ద్వారానే 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని అన్నారు. ఫైటర్ జెట్, బుల్లెట్ మోటార్‌సైకిల్ వంటి ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇచ్చామని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టులను, 5,757 కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేసిందని చంద్రబాబు వెల్లడించారు. తమ పార్టీ వచ్చే ఎన్నికల కోసం కాకుండా, వచ్చే తరాల భవిష్యత్తు కోసం పనిచేస్తుందని పునరుద్ఘాటించారు. ఆకాశమే హద్దుగా అవకాశాలను అందిపుచ్చుకోవాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు.

## ఓటరు జాబితాలో పేరు లేకపోతే పౌరసత్వం పోయినట్లు కాదు

- మొదటి పేజి తరువాయి

కూడిన ధర్మాసనం ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఓటరు జాబితా సవరణ కేవలం ఎన్నికల్లో పాల్గొనేందుకు మాత్రమే పరిమితమని పేర్కొంది. ఓటరు జాబితాలో పేరు చేర్చాలా? వద్దా? అని నిర్ణయించే అధికారం మాత్రమే ఎన్నికల సంఘానికి ఉందని స్పష్టం చేసింది. అంతేకానీ ఒక వ్యక్తి పౌరసత్వాన్ని నిర్ధారించే హక్కు ఈసీకి లేదని తెలిపింది.

**అనుమానిత పేర్లు కేంద్రానికి**

పౌరసత్వంపై అనుమానంతో ఓటరు జాబితా నుంచి తొలగించిన వారి పేర్లను మాత్రం కేంద్ర హోం శాఖకు పంపాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ వివరాలను నాలుగు వారాల్లోగా కేంద్ర ప్రభుత్వానికి అప్పగించాలని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో గత కొంతకాలంగా ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు తెరపడింది.

**ఎన్నికలలోపే తేల్చాలి**

కేంద్ర ప్రభుత్వం ఈ వివరాలను అందుకున్న తర్వాత పౌరసత్వ చట్టం 1955 ప్రకారం ఆయా వ్యక్తుల పౌరసత్వ క్లెయిములపై విచారణ జరపాలని కోర్టు పేర్కొంది. తదుపరి అసెంబ్లీ లేదా స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే ఈ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. ఒకవేళ విచారణలో వారు భారత పౌరులని తేలితే వెంటనే వారి పేర్లను మళ్లీ ఓటరు జాబితాలో పునరుద్ధరించాలని సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది.

## ప్రధాని మోదీతో 20 నిమిషాలు సీఎం విజయ్ భేటీ.. పలు విజ్ఞప్తులు

దేశ రాజధాని ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ కలిశారు. తన మొదటి అధికారిక పర్యటనలో భాగంగా ప్రధానితో 20 నిమిషాల పాటు సమావేశమైన ముఖ్యమంత్రి, తమిళనాడుకు సంబంధించిన వివిధ అంశాలపై విజ్ఞప్తి చేశారు. నెదర్లాండ్స్ నుంచి ఇటీవల పురాతన రాగి ఫలకాలను తిరిగి తీసుకువచ్చినందుకు ప్రధాని మోదీకి విజయ్ ధన్యవాదాలు తెలిపారు. మేకెదాటు ప్రాజెక్టుకు కర్ణాటకకు అనుమతి ఇవ్వవద్దని ప్రధానిని కోరారు. ఈ ప్రాజెక్టు వల్ల తమిళనాడులోని దిగువ ప్రాంతాల్లో నీటిలభ్యతపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, రాష్ట్రంలో ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభంలో రాష్ట్ర గీతాన్ని ప్లే చేయడానికి అనుమతించాలని కోరారు. విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో వందేమాతరం గీతాన్ని మొదట పూర్తిస్థాయిలో ఆలపించారు.

ఆ తర్వాత జాతీయ గీతం జనగణమన, తమిళ గీతాన్ని ఆలపించారు. ఈ నేపథ్యంలో విజయ్ తొలుత రాష్ట్ర గీతాన్ని ప్లే చేయడానికి అనుమతించాలని కోరారు. కర్ణాటక, తమిళనాడు

రాష్ట్రాల సరిహద్దుల్లో ఏకపక్షంగా ఏ ప్రాజెక్టు నిర్మించినా అది కావేరీ జల ట్రైబ్యునల్, సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తికి విరుద్ధమని ప్రధాని మోదీ దృష్టికి సీఎం విజయ్ తీసుకువచ్చారు. అలాంటి మేకెదాటు ప్రాజెక్టుకు కేంద్రం అనుమతించకూడదని కోరారు. ఈ మేరకు జలశక్తి మంత్రిత్వ శాఖను ఆదేశించాలని కోరారు.

## ఆఫ్‌లైన్ అయినా, హైబ్రిడ్ మోడల్ అయినా టీమ్ 11 కి బ్యాటింగ్ తప్పదు

- మొదటి పేజి తరువాయి

ప్రత్యేక పరిస్థితుల్లో హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహిస్తున్నాం. మనం హైబ్రిడ్ మోడల్ అనగానే టీమ్ 11 సంబరాలు చేసుకున్నారంట. ఆఫ్‌లైన్ అయినా, హైబ్రిడ్ మోడల్ అయినా టీమ్ 11 కి బ్యాటింగ్ తప్పదు" అని స్పష్టం చేశారు.

**లెజెండ్... అన్న ఎన్టీఆర్!**

విశ్వవిఖ్యాత నట సార్వభౌమ శ్రీ నందమూరి తారక రామారావు గారు దేశానికి లెజెండ్. తెలుగువారి ఆత్మ గౌరవం, తెలుగు వారి పౌరుషం ఎన్టీఆర్. సినిమాల్లో కానీ, రాజకీయాల్లో కానీ ఆయన ట్రెండ్ ఫాలో అవ్వలేదు.. ట్రెండ్ సెట్ చేశారు. ఆయన రికార్డులు బద్దలు కొట్టడం ఎవరివల్లా సాధ్యం కాదు. దేశానికి సంక్షేమం, అభివృద్ధి పరిచయం చేసింది ఎన్టీఆర్. 2 రూపాయలకు కిలో బియ్యం, పెన్షన్, జనతా వస్త్రాలు, పక్కా ఇళ్లు, గురుకుల పాఠశాలలు, మధ్యాహ్న భోజన పథకం, పటేల్-పట్వారీ విధానం రద్దు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటు, రోడ్ల నిర్మాణం, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు వంటివి ప్రవేశపెట్టింది ఎన్టీఆర్. స్త్రీశక్తిని మొదట గుర్తించింది, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు ఇచ్చింది, మహిళల కోసం ప్రత్యేకంగా పద్మావతి యూనివర్సిటీ పెట్టింది, మహిళలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఇచ్చింది అన్న ఎన్టీఆర్... అని లోకేశ్ ప్రశంసించారు.

## ఎబోలా ముప్పు: భారత్‌లో లేదు.. కానీ నిఘా తీవ్రం!

- మొదటి పేజి తరువాయి

ఇప్పటివరకు ఎలాంటి కేసులు నమోదు కాలేదని స్పష్టం చేసింది. అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో నిఘాను తీవ్రం చేసింది. విమానాశ్రయాలు, సరిహద్దుల్లో తనిఖీలను పటిష్ఠం చేసింది. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని కేంద్ర ఆరోగ్య శాఖ భరోసా ఇచ్చింది.

బెంగళూరులో అనుమానిత కేసు నెగెటివ్

ఇటీవల ఉగాండా నుంచి కర్ణాటకకు వచ్చిన ఓ వ్యక్తికి ఒళ్లు నొప్పులు రావడంతో అధికారులు ముందస్తు జాగ్రత్తగా బెంగళూరులో ఐసోలేషన్‌లో ఉంచారు. ఆ వ్యక్తి నుంచి సేకరించిన నమూనాలను పూణెలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపారు. ఆ పరీక్షల్లో అతనికి ఎబోలా నెగెటివ్ అని తేలడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఆఫ్రికా నుంచి వచ్చారనే కారణంతోనే ఈ ముందస్తు పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు స్పష్టం చేశారు.

**విమానాశ్రయాల్లో గట్టి నిఘా**

ప్రస్తుత గ్లోబల్ హెల్త్ ప్యాటర్న్‌ను గమనిస్తూ కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం అన్ని రకాల పబ్లిక్ హెల్త్ ప్రొటోకాల్స్‌ను అమలు చేస్తోంది. దేశంలోకి వైరస్ ప్రవేశించకుండా ఎంట్రీ పాయింట్లు, అంతర్జాతీయ విమానాశ్రయాల వద్ద నిరంతర స్క్రీనింగ్ ప్రక్రియను కొనసాగిస్తోంది. వైరస్ ముందస్తు గుర్తింపు కోసం దేశవ్యాప్త రెస్పాన్స్ మెకానిజంను మరింత బలోపేతం చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

**ఆఫ్రికాలో విస్తరణ**

మరోవైపు ఆఫ్రికా ఖండంలో బుండిబుగ్యో ఎబోలా వేరియంట్ తీవ్రత భయాందోళనలు కలిగిస్తోంది. కాంగోలో ఇప్పటివరకు 101 అధికారిక కేసులు, 10 మరణాలు నమోదైనట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ అధినేత టెడ్రోస్ అధానోమ్ తెలిపారు. అయితే క్షేత్రస్థాయిలో మరో 900కి పైగా అనుమానిత కేసులు, 220 మరణాలు పరిశీలనలో ఉన్నాయని, వైరస్ ఉద్ధృతి అంచనాలకు మించి ఉందని హెచ్చరించారు. పొరుగు దేశమైన ఉగాండాలోనూ ఇద్దరు వైద్య సిబ్బందితో కలిసి మొత్తం ఏడు కేసులు నమోదయ్యాయి.

# ఆత్మనిర్భరతకు నైపుణ్య శిక్షణలే బాట...జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ..






విజయవాడ, పెన్ పవర్, మే, 27, ఇబ్రహీంపట్నం ఎంపీడీవో కార్యాలయంలో నైపుణ్య శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేసి, జీవనోపాధి సహాయాన్ని అందించే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, ఈ ఆకాంక్షిత (ఆస్పిరేషన్ బ్లాక్ ) మండలంలో కమ్యూనిటీ మెంటల్ హెల్త్ కార్యక్రమాలను అమలు చేయడం ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. కేవలం ఇబ్రహీంపట్నం, జి.కొండూరు మండలాలే కాకుండా జిల్లా మొత్తం మానసిక ఆరోగ్య కార్యక్రమం సేవలు అందించాలని కోరారు. మానసిక సమస్యలకు మందుల ద్వారానే కాకుండా నైపుణ్య శిక్షణలు త్వరగా కోలుకునే దానికి మనసు దృష్టి మళ్లించడానికి ఉపయోగపడతాయని, ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి లో ఏర్పాటు చేసిన రైస్ సెంటర్ నందు అందించే శిక్షణలు కూడా వినియోగించుకోవాలని సూచిస్తూ, ఇది మానసిక ఆరోగ్యంపై ఉన్న అపోహలను, మూఢనమ్మకాలను తొలగించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. తదుపరి బేసిక్ టైలరింగ్ లో నైపుణ్య శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ప్రాజెక్టు లబ్ధిదారులకు రూ. 2,40,000 విలువైన తోపుడు బండ్లు, టీ స్టాల్, కూరగాయల వ్యాపారం, పండ్ల వ్యాపారం, ఫ్యాన్సీ వస్తువుల వ్యాపారం, టైలరింగ్ మెటీరియల్, వంటి జీవనోపాధి సామగ్రిని అందజేశారు. డా. బొల్లినేని కీర్తి మాట్లాడుతూ, వాసవ్య మహిళా మండలి ద్వారా లివ్ లవ్ లాఫ్ ఫౌండేషన్ సహకారంతో 28 మంది సభ్యులకు జీవనోపాధి అవకాశాలు కల్పించామని తెలిపారు. వీటితోపాటు ప్రభుత్వం నుండి అందించే బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల రుణాలు కుటుంబాలకు ఎంతో ఉపయోగపడతాయని ఆమె పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం (డి ఎం హెచ్ పి ) టీం జిల్లాలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో క్యాంప్ నిర్వహించడం ప్రాథమిక స్థాయిలోనే గ్రామ ప్రజలకు మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులో ఉంటాయని అది చాలా ప్రయోజనకరమని అన్నారు. ప్రాజెక్టు పని చేసిన రెండు సంవత్సరాలలో ప్రజల ఆలోచనా విధానంలో మార్పు వచ్చిందని, మూఢనమ్మకాలు తగ్గి ప్రజలు ఇప్పుడు ఆరోగ్య సేవలను వినియోగిస్తున్నారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పాలడుగు జ్యోత్స్న (ఎంపీపీ), డి. శకుంతల (ఎంపీడీవో), వై. వెంకటేశ్వర్లు (ఎంఆర్వో), డాక్టర్ ఆర్. రామారావు (ప్రాజెక్ట్ డైరెక్టర్, వాసవ్య మహిళా మండలి), వీఎంఎం వాలంటీర్లు, సపోర్టు గ్రూపు సభ్యులు పాల్గొన్నారు...

# జూన్ 5 నుంచి 14వ తేదీ వరకు సర్‌కు సన్నద్ధత కార్యక్రమం... జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ..





విజయవాడ, పెన్ పవర్, మే, 27, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు సంబంధించి జూన్ 5 నుంచి 14వ తేదీ వరకు సన్నద్ధత కార్యకలాపాలు జరుగుతాయని.. ఆపై జూన్ 15 నుంచి జులై 14 వరకు బీఎల్‌వోల ద్వారా ఇంటింటి సర్వే జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. త్వరలో సర్‌కు సన్నద్ధత కార్యక్రమాల షెడ్యూల్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కలెక్టర్ లక్ష్మీశ బుధవారం కంచికచర్లలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. బూత్‌స్థాయి అధికారి (బీఎల్‌వో)తో మాట్లాడి.. ఆ ప్రాంత ఓటర్ల జాబితా సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈసీఐ, సీఈవో మార్గదర్శకాలకు అనుగుణంగా సర్ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా చూడటంతో పాటు అనర్హులు, మృతులు, శాశ్వతంగా వలసవెళ్లినవారు వంటి వారి ఓట్లను సర్ ప్రక్రియ ద్వారా తొలగించడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి పారదర్శకతకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీలు, భాగస్వామ్య పక్షాల సహకారంతో ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయనున్నామని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కలెక్టర్ పర్యటనలో నందిగామ ఆర్‌డీవో అనిల్ కుమార్, తహసీల్దార్ వి.మానస తదితరులు పాల్గొన్నారు...

# మహిళల భద్రతకు ఏపీ మహిళా కమిషన్ కీలక ముందడుగు...డాక్టర్ రాయపాటి శైలజ...







గుంటూరు, పెన్ పవర్, మే, 27, పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులను నివారించేందుకు అమలులో ఉన్న పోష్ (ప్రెవేన్షన్ ఆఫ్ సెక్సువల్ హరస్మెంట్ ) చట్టాన్ని రాజకీయ పార్టీలు, న్యాయవాదుల వృత్తి వర్గాలకు కూడా విస్తరించే దిశగా ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ కీలక చర్యలు ప్రారంభించింది. ఈ అంశంపై మంగళవారం ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ కార్యాలయంలో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బార్ అసోసియేషన్ సభ్యులు, బార్ కౌన్సిల్ ప్రతినిధులు హాజరై చట్టం అమలు విధానంపై తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. ఒక్క వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ మినహా మిగిలిన అన్ని రాజకీయ పార్టీలు పోష్ చట్ట విస్తరణకు తమ మద్దతు ప్రకటించడం విశేషం. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ మాట్లాడుతూ... మహిళల భద్రత, గౌరవ పరిరక్షణ ప్రతి వ్యవస్థ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రస్తుతం కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో అమలులో ఉన్న పోష్ చట్టాన్ని రాజకీయ వ్యవస్థలు, న్యాయవాదుల వృత్తి వర్గాలకు కూడా వర్తింపజేయాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల్లో పనిచేసే మహిళలు, అలాగే న్యాయవాదుల వృత్తిలో ఉన్న మహిళలు ఎదుర్కొనే సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ చట్ట విస్తరణపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వానికి సవరణ ప్రతిపాదించి, అసెంబ్లీలో ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలోనే ఈ విధానానికి శ్రీకారం చుడుతోందని, ఇది మహిళల రక్షణకు చారిత్రాత్మకమైన సంస్కరణగా నిలుస్తుందని రాయపాటి శైలజ అభిప్రాయపడ్డారు. మహిళలకు భయరహిత వాతావరణం కల్పించడంలో ఈ నిర్ణయం కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేంద్రప్రసాద్, సుప్రీంకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ లీగల్ అడ్వైజర్ రావూరి సూయజ్, తెలుగు దేశం పార్టీ అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, సిపిఎం రాష్ట్ర నాయకులు రమాదేవి, నాగేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర నాయకురాలు నాగమల్లేశ్వరి, జనసేన పార్టీ ప్రతినిధి శిరీష, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు గోపాలకృష్ణమూర్తి, హరికృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు వరలక్ష్మి, సిపిఐ నాయకురాలు దుర్గాభవాని, న్యాయవాదులు జగదీశ్వరి, విజయలక్ష్మి, అరుణ, భవాని తదితరులు పాల్గొన్నారు...

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నందమూరి తారక రామారావు ఘనంగా నివాళులు...



గుంటూరు, పెన్ పవర్, మే, 27, ఈరోజు మహానాడు సందర్భంగా 51 డివిజన్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ ముప్పవరపు భారతి 51 డివిజన్ ప్రెసిడెంట్ బొంతల సాయి బాబా ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని పూలమాలయం ఘనంగా నిర్వహించడం జరిగింది ఈసందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ తెలంగాణ లో తెలుగుదేశం పార్టీ తో పాటు ఎన్టీఆర్ పేరు కూడా లేకుండా చేయాలని కెసిఆర్ తో పాటు తెలంగాణ ప్రాంతీయవాదం ముసుగు వీరులకు చెప్పుతో కొట్టినట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ మాట ఇచ్చి నిలబెట్టుకున్న గొప్ప నేత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.తనకు నీడ ను ఇచ్చిన తెలుగుదేశం పార్టీ పై తెలుగుదేశం పార్టీ నాయకుల పై తాను పార్టీ లో లేకపోయినా గౌరవం తో ఉండటం మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కు రాజకీయాలలో గౌరవం పెంచింది. పసుపు సైనికులకు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి రాజకీయ హీరో,కరుడు కట్టిన పసుపు సైనికులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ను ఇప్పటికీ తెలుగుదేశం పార్టీ నాయకుడిగా నే చూడటం .ప్రక్క తెలుగు రాష్ట్రం లో కూడా స్వంత రాష్ట్రం కంటే ఎక్కువ అభిమానులు ఉండటం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొప్పతనం జిల్లా పి.సి.షన్ అధికార పార్టీని లక్ష్మయ్య అన్నారు.పార్టీ లు వేరైనా సిద్ధాంతాలు వేరైన ఒక గొప్ప నాయకుడి సేవలు గుర్తించి మరో పార్టీ అధికారం లో ఉన్నా ఎన్టీఆర్ విగ్రహం పెట్టాడటం అలాంటి ఆలోచన చేయడం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి సాధ్యమైంది రాజకీయాల్లో కొత్త ఒరవడి సృష్టించిన గొప్ప నాయకుడు గా చరిత్రలో నిలిచిపోతాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి .ఒకప్పుడు రాజకీయ భిక్ష పెట్టిన తెలుగుదేశం పార్టీ లేకుండా చేయాలని చూసిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేయని ప్రయత్నాలు లేవు..ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ ప్రభుత్వం స్వాధీనం చేసుకొనే ప్రయత్నాలు ముమ్మరంగా కృషి చేశాడు..ఎన్టీఆర్ సమాధిని కూడా తొలగించే ప్రయత్నం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేశాడు. కానీ ప్రజల గుండెల్లో శాశ్వతంగా ఉన్న అభిమానం తొలగించలేకపోయాడు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్..అభిమానుల ఆక్రోశం తో అధికారం కోల్పోయాడు.దేశం లో ఎన్టీఆర్ పండుగ చేసుకొంటున్న వేళ తెలంగాణ గడ్డ మీద ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ పండగ వాతావరణం మహానాడు ఎన్టీఆర్ పుట్టినరోజు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఈసందర్భంగా జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మైనార్టీ క్రిస్టియన్ చైర్మన్ మద్దిరాల మేని రాష్ట్ర కార్యదర్శి చిట్టా బత్తిన చిట్టిబాబు మాజీ కార్పొరేటర్ గోళ్ళు ప్రభాకర్ 51 డివిజన్ ప్రెసిడెంట్ బాజీ డివిజన్ కార్యదర్శి కోటపాటి ప్రభాకర్ 51 డివిజన్ నాయకులు మోహన్, రమణ, కోట గోపాల్ మాధవరావు 51వ డివిజన్ సెక్రెటరీవరికుంట రాజు యూనిట్ ఇన్చార్జి ప్రసాద్ పలువురు నాయకులు పాల్గొన్నారు..

# పేదల సేవే తెలుగుదేశం పార్టీ లక్ష్యం మహానాడులో ఎమ్మెల్యే గళ్ళా మాధవి..



గుంటూరు, పెన్ పవర్, మే, 27, తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానాడు వేదికపై “పేదల సేవలో” అనే కీలక తీర్మానం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే ఁ టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.. పేదల సేవ కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని, “సమాజమే దేవాలయం -- ప్రజలే దేవుళ్లు” అనే సిద్ధాంతాన్ని నినాదంగా కాకుండా జీవన విధానంగా మార్చుకున్న నేత ఎన్టీఆర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వంటి నాయకుల ఆలోచనలే పార్టీకి బలమని పేర్కొన్నారు. పేదలకు సేవ చేయడం మాత్రమే కాదు, సమాజంలో “పేదవాడు” అనే పదమే లేకుండా చేయాలనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతోందని గళ్ళా మాధవి అన్నారు. విలువలు, త్యాగాలు, సామాజిక బాధ్యతలకు నిలయంగా టీడీపీ నిలిచిందని చెప్పారు. ప్రజల సాధికారత, తెలుగు జాతి ఆత్మగౌరవ పరిరక్షణ దిశగా పార్టీ నాయకత్వం చేస్తున్న కృషిని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు.

# జాబ్ మేళ పోస్టర్ ను విడుదల చేసిన.. నగర కమిషనర్ కె. మయూర్ అశోక్...




గుంటూరు, పెన్ పవర్, మే, 27, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారి ఆదేశముల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఉన్నటు వంటి నిరుద్యోగ సమస్యను రూపుమాపడానికి కృషి చేస్తున్నది. దీనిలో భాగముగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ మేళాలు నిర్వహించి ఉద్యోగాలు ఇప్పించడం జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం గౌరవ శాసన సభ్యులు ఎమ్మెల్యే శ్రీ గల్లా మాధవి గారి ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీన హిందూ ఫార్మసీ కళాశాల అమరావతి రోడ్, నగరాలు, వేళంగిణి నగర్, గుంటూరు నందు జరగబోవు ఉద్యోగ మేళా పోస్టర్ ను నగర కమిషనర్ కే. మయూరు అశోక్ ××ూూ, నగర పాలక సంస్థ లోని తన ఛాంబర్ నందు మెగా జాబ్ మేళ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము నిరుద్యోగ సమస్యను రూపుమాపడానికి కృషి చేస్తున్నది అని తెలియజేశారు. ఈ జాబ్ మేళాకు 30 కంపెనీల పాల్గొంటున్నాయి, మరియు 1100 ఉద్యోగ అవకాశములు ఉన్నాయన్నారు. కావున జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతి యువకులు ఈ జాబ్ మేళాలో లో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. గుంటూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీ కొండా సంజీవరావు గారు మాట్లాడుతూ, ఈ మెగా జాబ్ మేళాలో 10వ తరగతి నుంచి బి.టెక్ వరకు చదువు కొన్న ప్రతి ఒక్కరు ఈ జాబ్ మేళ లో పాల్గొని ఈ గొప్ప అవకాశమును సద్వినియోగం చేసుకొనవలసిందిగా తెలియజేశారు ఈ కార్యకరములో ఇంకుక్స్ ఏఐ ప్రైవేట్ లిమిటెడ్, క్లౌడ్ మెల్లో టెక్నాలజీస్ ఎల్ఎల్పి, మాల్టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎఫ్ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, బుక్ ఎక్స్‌పర్ట్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రైమారియా హెల్త్ కేర్, వంటి పలు రకాల కంపెనీలు హాజరవుతున్నాయి అని తెలియజేసారు. జీతం వారి విద్యర్హతను బట్టి సుమారు 9000 -- 35,000 రూపాయల వరకు ఉండవచ్చని తెలిపారు ఈ జాబ్ డ్రైవ్ కు ఎస్.ఎస్.సి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, బి.టెక్, డిప్లొమా, ఫార్మసి, మరియు పి.జి విభాగముల వరకు చదువుకున్నటు వంటి 18-25 సం॥ల వయసు గల నిరుధ్యోగ యువతి యువకులు వారి యొక్క బయోడేటా లేదా రెస్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్ నకలు మరియు పాస్ పోర్ట్ ఫోటో తో నేరుగా ఇంటర్వ్యూ కు హాజరు కాగలరు.

చిరునామా :

తేదీ : 02-06-2026

సమయం : ఉదయం 09:00 నుండి సాయంత్రం 04:00 వరకు ఇంటర్వ్యూలు జరుగును.

స్థలం : హిందూ ఫార్మసీ కళాశాల అమరావతి రోడ్, నగరాలు, వేళంగిణి నగర్, గుంటూరు.

సంప్రదించవలసిన నంబర్లు :- ఎన్.కృపానందం (9581794605), ఎ.రామకృష్ణ (7731982861) నరేష్ దేవర (9866366187)

ఔత్సాహిక యువతి యువకులు ముందుగా నైపుణ్యం .ఏపీ .గవర్నమెంట్ .ఇన్ /అనే వెబ్ సైట్ నందు రిజిస్టర్ చేసుకోగలరు. మరిన్ని వివరములకు కంట్రోల్ నంబర్: 9988853335, 8712655686, 8790118349, 8790117279 మరియు పైన తెలిపిన నంబర్లను సంప్రదించగలరు.

గమనిక: యువతీ యువకులు జాబ్ డ్రైవ్ జరుగు ప్రదేశం నందు స్పాట్ రెజిస్ట్రేషన్ సౌకర్యం కలదు.

# మహానాడులో సీఎం చంద్రబాబు ప్రారంభోపన్యాసం

**విజన్ పాలిటిక్స్‌కు నాంది పలికింది టీడీపీ**

**స్వర్ణాంధ్ర 2047' లక్ష్యంగా రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు**

**స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని కేడర్‌కు పిలుపు**

**నరసరావుపేటలో క్లస్టర్ వద్ద డిజిటల్ మహానాడులో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు**





నరసరావుపేట, పెన్ పవర్ మే 27: రెండు రోజుల పాటు వర్చువల్ విధానంలో 1,875 క్లస్టర్ల వేదికగా నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ మహానాడు బుధవారం ఘనంగా ప్రారంభమైంది. నరసరావుపేట నియోజకవర్గం లో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదరవాడ అరవింద బాబు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్లస్టర్లలో డిజిటల్ స్క్రీన్స్ వద్ద పండుగ వాతావరణం నెలకొంది. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళా నాయకురాళ్లు వేలాదిగ తరలివచ్చారు. ప్రధాన కార్యక్రమం లక్షలాది మంది పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్న తొలి రోజు సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రారంభోపన్యాసం చేస్తూ టీడీపీ భవిష్యత్ కార్యాచరణ, అభివృద్ధి లక్ష్యాలు, సంక్షేమ కార్యక్రమాలు, రాజకీయ వ్యూహాలపై పలు కీలక ప్రకటనలు చేశారు. టీడీపీ ప్రతి అడుగు సంచలనమే. విజన్ పాలిటిక్స్‌కు నాంది పలికింది తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్న చంద్రబాబు, పార్టీ పుట్టుక నుంచి ప్రస్థానం వరకు ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేసిందన్నారు. తొలి రోజే మహానాడులో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ఆనందదాయకమని అభినందించారు.

వైసీపీ పార్టీపై విమర్శలు:... గొడ్డలి పార్టీఅంటూ ఎద్దేవా

ప్రతిపక్ష వైసీపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన చంద్రబాబు, రక్తాభిషేకాలు చేసేవారు స్వర్ణాంధ్ర చరిత్రను లిఖించలేరు. పేదలకు కావలసింది సంక్షేమం, పథకాలు.. గొడ్డలి వేట్లు కాదు. యువతకు కావలసింది ఉద్యోగాలు.. గొడ్డలి పోట్లు కాదు. రాష్ట్రానికి కావలసింది శాంతి భద్రతలు.. రక్త చరిత్ర కాదు అని వ్యాఖ్యానించారు. వైసీపీకి విషం కక్కడమే తప్ప విజన్ లేదు. వేట కొడవళ్ల నుంచి గొడ్డలి పార్టీగా మారటం వారి విధానం. ఐటీ నుంచి క్వాంటం దిశగా ఎదగటం మన విధానం. బోత్ ఆర్ నాట్ సేమ్ అంటూ విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానుల పేరుతో ప్రజలను గందరగోళానికి గురిచేశారని, ఇప్పుడు విజన్ పేరుతో మాట్లాడుతున్నారని ఆరోపించారు. బ్లఫ్ బ్యాచ్, ఫేక్ న్యూస్ బ్యాచ్ అంటూ ఎద్దేవా చేశారు.

స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్

2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్-1 రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌లో భాగంగా తలసరి ఆదాయం, మానవాభివృద్ధి సూచీలు, మౌలిక వసతుల కల్పనలో జాతీయ సగటు కంటే రెట్టింపు వృద్ధి సాధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి భారీ స్థాయిలో పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని చెప్పారు. గతంలో రాష్ట్రానికి ఐటీ రంగాన్ని తీసుకువచ్చిన టీడీపీ ఇప్పుడు క్వాంటం టెక్నాలజీ, ఆవిష్కరణల దిశగా ముందుకు వెళ్తోందన్నారు.

మహిళా సాధికారతకు ప్రాధాన్యం

పార్టీలోనూ పాలనలోనూ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. స్థానిక సంస్థల నుంచి అసెంబ్లీ వరకు మహిళలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాలు కొనసాగిస్తామని, ఆడబిడ్డ నిధి కింద మహిళలకు ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు. దివ్యాంగ శక్తి పేరిట దివ్యాంగ మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు.

రైతులు, సంక్షేమం, ఆరోగ్య రంగంపై హామీలు

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తూ అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఏడాదికి రూ.14,000 ఆర్థిక సాయం అందిస్తామని చంద్రబాబు తెలిపారు. జూన్ 1 నుంచి కొత్త ఆక్వా రైతులకు యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ప్రకటించారు. సంక్షేమంలో భాగంగా రూ.63,000 కోట్లతో పెన్షన్ల పంపిణీ జరుగుతోందని, ఇది రాష్ట్ర చరిత్రలోనే పెద్ద సంక్షేమ కార్యక్రమాల్లో ఒకటని పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో ఆగస్టు 15 నుంచి సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డులను అమల్లోకి తీసుకువస్తామని తెలిపారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రత కల్పించడమే లక్ష్యమని వెల్లడించారు.

సాగునీటి ప్రాజెక్టుల పూర్తి లక్ష్యం

పోలవరం ప్రాజెక్టును పుష్కరాల కంటే ముందే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో దెబ్బతిన్న డయాఫ్రామ్ వాల్‌ను రూ.1,000 కోట్లతో తిరిగి నిర్మించామని చెప్పారు. హంద్రీ-నీవా ద్వారా కుప్పం వరకు నీరు తీసుకెళ్లామని, వెలిగొండ ఫేజ్-1 పూర్తి చేసి మార్కాపురం సహా ఇతర ప్రాంతాలకు సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. రూ.36,000 కోట్లతో 36 ప్రాధాన్యతా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని చెప్పారు. భూగర్భ జలాల పెంపు కోసం జలధార" పేరిట 100 రోజుల కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు.

స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం

త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఏ ఎన్నికలైనా గెలుపే ప్రధానం. ఇగోలకు వెళ్లొద్దు. మిత్రపక్షాలతో సమన్వయంతో ముందుకు సాగాలి. 2024 ఎన్నికల విజయం మళ్లీ పునరావృతం అయ్యేలా పని చేయాలి అని సూచించారు. తెలుగుదేశం పార్టీకి అసలు బలం కేడరేనని, నాయకులను తయారు చేసే విశ్వవిద్యాలయం టీడీపీ అని పేర్కొంటూ కార్యకర్తల సాధికారత కోసం నిరంతరం పనిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో కేడర్ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చివరగా పేదలకు కావలసింది పథకాలు.. గొడ్డలి వేట్లు కాదు. రాష్ట్రానికి కావలసింది శాంతి భద్రతలు.. రక్తాభిషేకాలు కాదు అంటూ చంద్రబాబు తన ప్రసంగాన్ని ముగించారు. అనంతరం నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని క్లస్టర్ల వద్ద పండుగ వాతావరణం నెలకొంది.

కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ వ్యవస్థాపకులు, స్వర్గీయ నందమూరి తారక రామారావు జన్మదినం సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డిజిటల్ మహానాడు కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో అధికారికంగా ప్రారంభించిన ఎమ్మెల్యే, క్లస్టర్ల వద్ద ఏర్పాటు చేసిన తెరలపై మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుండి టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరుగుతున్న మహానాడు ప్రత్యక్ష ప్రసారాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద బాబు సమక్షంలో కార్యకర్తలు, నాయకులు పార్టీ సిద్ధాంతాల పట్ల ప్రతిజ్ఞ చేశారు. డిజిటల్ మహానాడు ద్వారా పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.






# నిబద్ధతతో ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి.....



గుంటూరు, పెన్ పవర్, మే, 27, తెలుగుదేశం పార్టీ మహానాడు వేదికపై పొలిట్ బ్యూరో సభ్యురాలిగా హాజరైన గళ్ళా మాధవి ... అధినేత చంద్రబాబు నాయుడు తో కలిసి చిరునవ్వులు పంచుకున్న ఆ క్షణం కేవలం ఒక ఫోటో కాదు... అది నమ్మకానికి ప్రతిబింబం... సేవా రాజకీయాలకు సంకేతం... ప్రజల కోసం నిరంతరం శ్రమించే నాయకత్వానికి అందమైన గుర్తు. నాయకుడు చూపిన మార్గంలో... ప్రజల ఆశయాలను హృదయంలో పెట్టుకొని... గుంటూరు పశ్చిమ అభివృద్ధి కోసం మరింత నిబద్ధతతో ముందుకు సాగుతున్న గళ్ళా మాధవి కి మహానాడు వేదిక మరో స్ఫూర్తిగా నిలిచింది.

# వేమూరు నియోజకవర్గ పరిధిలో ఘనంగా మహానాడు-2026





భట్టిప్రోలు పెన్ పవర్ "మే,27: వేమూరు నియోజకవర్గ శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు ఆదేశాల మేరకు వేమూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 10 క్లస్టర్లలో మహానాడు--2026 కార్యక్రమాలను డిజిటల్/హైబ్రిడ్ విధానంలో అత్యంత ఘనంగా బుధవారం ప్రారంభ మయ్యాయి ప్రతి క్లస్టర్‌లో పండుగ వాతావరణం నెలకొని, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు,యువత మరియు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని మహానాడు మొదటిరోజు వేడుకలను విజయవంతం చేశారు. మండల కేంద్రమైన భట్టిప్రోలు,వెల్లటూరు గ్రామాలలో మహానాడు వేడుకలు ఘనంగా నిర్వహించారు. భట్టిప్రోలు లో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా క్లస్టర్ బాధ్యతల నేపథ్యంలో ముందుగా స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. వెల్లటూరు క్లస్టర్ ప్రతినిధి మోటూరు పుణ్య శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం"మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీతంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పార్టీ జెండాలు, బ్యానర్లు, నినాదాలతో ప్రతి క్లస్టర్ ప్రాంతం పసుపుమయంగా మారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం నుండి ప్రత్యక్ష ప్రసారమైన మహానాడు కార్యక్రమాలను ఆయా క్లస్టర్లలో ఏర్పాటు చేసిన భారీ ఎల్‌ఈడి స్క్రీన్ల ద్వారా ప్రజలు ఆసక్తిగా వీక్షించారు.పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు,జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ల ప్రసంగాలు కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. సాంకేతికతను వినియోగిస్తూ హైబ్రిడ్ విధానంలో మహానాడు నిర్వహించడం దేశ రాజకీయ చరిత్రలోనే ఒక వినూత్న కార్యక్రమంగా పార్టీ శ్రేణులు అభిప్రాయపడ్డారు.

క్లస్టర్ -- 1
వలివేరు గ్రామం-- ఈమని కల్యాణ మండపం
క్లస్టర్ -- 2
చుండూరు గ్రామం-- వాసవి కల్యాణ మండపం
క్లస్టర్--3 అమృతలూరు గ్రామం --ఆర్యవైశ్య కల్యాణ మండపం
క్లస్టర్--4
గోవాడ గ్రామం-- ఎన్టీఆర్ కమ్యూనిటీ హాల్
క్లస్టర్--5
వేమూరు గ్రామం--లక్ష్మి పద్మావతి కల్యాణ మండపం
క్లస్టర్--6
పెరవలి గ్రామం--టిటిడి కల్యాణ మండపం
క్లస్టర్--7కొల్లూరు గ్రామం--ఎంప్లాయిస్ రీ క్రియేషన్ హోమ్
క్లస్టర్ --8
కొల్లూరు గ్రామం-- కాకతీయ కల్యాణ మండపం
క్లస్టర్--9
వెల్లటూరు గ్రామం -- సిద్ధి గణపతి కల్యాణ మండపం
క్లస్టర్ --10
భట్టిప్రోలు గ్రామం--వి కన్వెన్షన్ హాల్

ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, కార్యకర్తలను ప్రత్యక్షంగా డిజిటల్ వేదిక ద్వారా అనుసంధానం చేస్తూ నిర్వహిస్తున్న ఈ మహానాడు కార్యక్రమం పార్టీ సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,848 క్లస్టర్లలో మహానాడు నిర్వహించడం ద్వారా తెలుగుదేశం పార్టీ కొత్త చరిత్ర సృష్టిస్తోందన్నారు. పార్టీ భావజాలాన్ని ప్రతి కార్యకర్తకు చేరవేసే విధంగా రూపొందించిన ఈ హైబ్రిడ్ విధానం భవిష్యత్ రాజకీయాలకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు.

ఈ యేడాది మహానాడులో "స్త్రీశక్తి" ప్రధాన అంశంగా చర్చలు జరగడం విశేషమని,మహిళా సాధికారత,సంక్షేమం, అభివృద్ధిపై పార్టీ కట్టుబాటును ఈ వేదిక ద్వారా స్పష్టంగా తెలియజేస్తోందన్నారు.మహిళల భాగస్వామ్యం గణనీయంగా పెరగడం పట్ల పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం,డిజిటల్ పాలన,యువత భవిష్యత్,పార్టీ భవిష్యత్ కార్యాచరణపై జరిగిన చర్చలను కార్యకర్తలు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. వేమూరు నియోజకవర్గంలోని అన్ని క్లస్టర్లలో కార్యక్రమాలకు ఎటువంటి అంతరాయం లేకుండా మొదటి రోజు కార్యక్రమాలు దిగ్విజయంగా జరిగాయి.

# పెరవలి లో ఘనంగా ప్రారంభమైన మహానాడు





వేమూరు(భట్టిప్రోలు) పెన్ పవర్, మే,, 27: వేమూరు నియోజక వర్గం పెరవలి గ్రామంలో బుధవారం వేమూరి శాసనసభ్యులు నక్క ఆనందబాబు సూచనల మేర పెరవలి క్లస్టర్ ఇంచార్జ్ దాది లక్ష్మణరావు ఆధ్వర్యంలో స్థానిక తిరుమల-తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో మహానాడు వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయని తెలుగుదేశం పార్టీ నాయకులు యేమినే ని సీతారాం తెలిపారు.అధిక సంఖ్యలో కార్యకర్తలు సమావేశంనకు విచ్చేయగా మహానాడు డిజిటల్ హైబ్రిడ్ విధానంలో ఘనంగా జరిగిందన్నారు.అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు మహిళలు ప్రజలు పాల్గొన్నారని సీతారాం తెలిపారు. ముందుగా నందమూరి తారకరామారావు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారని. అనంతరం మా తెలుగు తల్లికి గీతాన్ని ఆలకించారు.ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘాల అధ్యక్షులు ఏమినేని శేషగిరిరావు,పెరవలి పిఏసిఎస్ అధ్యక్షులు ఉక్కుర్తి నాగయ్య, డిసి అధ్యక్షులు దండే వెంకట సుబ్బారావు, కుంచే హరి నారాయణ, నాయకులు ప్రసాదం రామయ్య,మేరా వర్ధిని,మన్నే వేణుగోపాలకృష్ణ(పసి),బండారు సూరిబాబు,బలిజేపల్లి సుధాకర్ పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు,ప్రజలు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ జయంతిని జయప్రదం చేయాలి.

భట్టిప్రోలు,పెన్ పవర్(మే 27) మండల కేంద్రమైన భట్టిప్రోలు లోని క్లస్టర్ 10 లో నున్న తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఉదయం 9 గంటలకు స్థానిక వ్యవసాయ మార్కెట్ యాడ్ దగ్గరికి రావలసిందిగా రాష్ట్ర టిడిపి కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. నందమూరి తారక రామారావు విగ్రహం దగ్గరకు వచ్చి అక్కడ అన్న నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిఎమ్ రావు హైస్కూల్ సమీపంలో ఉన్న వి కన్వెన్షన్ లో జరగబోయే 2వ రోజు వర్చువల్ మహానాడు కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయవలసిందిగా సాయిబాబా కోరారు. మహానాడుకు వచ్చేవారు అందరూ వారి,వారి య సభ్యతం కార్డులు తీసుకొని వచ్చి హాజరు వేయించుకోవాల్సిందిగా సూచించారు.



# బక్రీద్ ఏర్పాట్లను పరిశీలించిన: మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు

చిలకలూరిపేట , పెన్ పవర్, మే 27 : చిలకలూరిపేట: పట్టణంలో పవిత్రమైన బక్రీద్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులు ఈద్గా మైదానం వద్ద ప్రశాంతమైన వాతావరణంలో ప్రార్థనలు చేసుకునేందుకు మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరిబాబు ఆదేశాల మేరకు శానిటరీ సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉంటూ ఈద్గా పరిసరాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రాంగణమంతా చెత్తాచెదారం లేకుండా చేసి, బ్లీచింగ్ మరియు శానిటేషన్ చర్యలను చేపట్టారు.



# మహానాడు.. తెలుగు ప్రజల భావోద్వేగం : ప్రత్తిపాటి

పార్టీలో మహిళల ప్రాతినిధ్యం పెంచాలన్న లోకేశ్ నిర్ణయంపై హర్షాతిరేకాలు.

స్త్రీల రాజకీయ ప్రాతినిధ్యంతో ప్రజలకు మరింత మేలు.

మహిళలు, యువత భాగస్వామ్యంతో పార్టీ ప్రస్థానం దేశానికే గర్వకారణంగా నిలవనుంది.

మహానాడు డిజిటల్ అటెండెన్స్ లో జిల్లాలో చిలకలూరిపేటే టాప్ : బీ.టీ.నాయుడు.

హైబ్రిడ్ మోడ్ మహానాడులో పాల్గొన్న శాసనసభ్యులు ప్రత్తిపాటి, నరసరావుపేట పార్లమెంట్ కో ఆర్డినేటర్ బీ.టీ.నాయుడు.





చిలకలూరిపేట , పెన్ పవర్, మే 27 : : మహానాడు కేవలం పార్టీ కార్యక్రమం కాదని.. తెలుగుప్రజలు అనుభవించే గొప్ప భావోద్వేగమని, టీడీపీ పండగ నేడు రాష్ట్రవ్యాప్తంగా ఆనందోత్సాహాల మధ్య జరుగుతోందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. మహానాడు నిర్వహణలో భాగంగా హైబ్రిడ్ మోడ్ లో చిలకలూరిపేట పట్టణ పరిధిలోని క్లస్టర్లలోని కార్యక్రమాలను నరసరావుపేట పార్లమెంట్ కో ఆర్డినేటర్ బీ.టీ.నాయుడు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి స్వయంగా పరిశీలించారు. 5 క్లస్టర్ల ఇన్ ఛార్జులు, పార్టీ శ్రేణులతో ఇరువురు నేతలు స్వయంగా మాట్లాడారు. తొలుత పలు క్లస్టర్లలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులు అర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రత్తిపాటి పార్టీ సీనియర్ కార్యకర్తల్ని సన్మానించి, వారి ఆలోచనలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం ఇరువురు విలేకరులతో మాట్లాడారు.

జిల్లాలో తొలిస్థానం..రాష్ట్రంలో 12వ స్థానం : బీ.టీ.నాయుడు

హైబ్రిడ్ మోడ్ మహానాడుపై చిలకలూరిపేట పార్టీ శ్రేణులు మంచి అవగాహన, ఆసక్తితో పనిచేశాయని, సీనియర్ నాయకులు ప్రత్తిపాటి నాయకత్వంలో క్రమశిక్షణ, పట్టుదలతో తొలిరోజు కార్యక్రమాలు విజయవంతం అయ్యాయని నరసరావుపేట పార్లమెంట్ కో ఆర్డినేటర్ బీ.టీ.నాయుడు పేర్కొన్నారు. హైబ్రిడ్ మోడ్ మహానాడు డిజిటల్ అటెండెన్స్ లో చిలకలూరిపేట నియోజకవర్గం జిల్లాలో ప్రథమస్థానంలో నిలవగా, రాష్ట్రంలో 12వ స్థానంలో నిలిచినట్టు నాయుడు చెప్పారు.

లోకేశ్ ప్రకటనపై మహిళల్లో హర్షాతిరేకాలు

తాజా మహానాడు సాక్షిగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారాలోకేశ్ చేసిన ప్రకటనపై యావత్ మహిళా లోకం నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవతున్నాయని ప్రత్తిపాటిచెప్పారు.

స్వర్గీయ ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, ప్రత్యేక విద్యావ్యవస్థలు ఏర్పాటుచేస్తే, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నారీలోక ఆర్థిక శక్తి, వారి ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పాడన్నారు. అన్నిరంగాల్లో ముందున్న స్త్రీమూర్తులను రాజకీయాల్లోనూ ఉన్నతస్థానాల్లో నిలపడం ద్వారా ప్రజలకు మరింత మేలు చేయాలన్నయువనేత లోకేశ్ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు. మహిళల మనోధైర్యం, ఓర్పు, నేర్పుతో పాటు, యువత శక్తి సామర్థ్యాలతో భవిష్యత్ లో పార్టీ ప్రస్థానం దేశానికే గర్వకారణంగా నిలవనుందన్నారు. ఈ మహానాడులో ప్రతి నియోజకవర్గం నుంచి 5 వేలు అంతకు మించి వర్చువల్ గా పాల్గొంటున్నారని, ఈ విధానంలో ఎక్కువమందిని టీడీపీ పండుగలో భాగస్వాముల్ని చేయడంలో పార్టీ అధినాయకత్వం విజయవంతమైందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వార్ ఆడక స్వాములు, నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జి లు, తెలుగుదేశం పార్టీ వివిధ హోదాలలో ఉన్న రాష్ట్ర, జిల్లా, పట్టణ, మండల, వార్డు, గ్రామ, అనుబంధ సంస్థల నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీ శక్తిని చాటే వేదికే కాకుండా మహిళల కు రాజకీయ పునర్జీవనం...పార్లమెంటు ప్రధాన కార్యదర్శి నవమి లాం....





గుంటూరు, పెన్ పవర్, మే, 27, తెలుగుదేశం పార్టీ మహిళా సాధికారతకు పెద్దపీట వేసిందని 23వ డివిజన్ అంగన్వాడీ డ్వాక్రా సాధికార సంస్థ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి నవమి లాం పేర్కొన్నారు అమరావతి రోడ్ లో ఏర్పాటు చేసిన మహానాడు కార్యక్రమంలో నవమి లాం జూనియర్ ఆర్టిస్టులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు నవమి లాం మీడియా సమావేశంలో మాట్లాడుతూ కా తెలుగుదేశం పార్టీ మహిళల్లో ఆత్మ సిద్ధైరాన్ని నింపడానికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడమే కాకుండా వారిలో మనోధైర్యాన్ని నింపడానికి పార్టీ కార్యకలాపాలు అన్నింటిలో మహిళలను సగభాగం చేయడం గర్వకారణంగా చెప్పుకోవచ్చు అన్నారు సూపర్ సిక్స్ పథకాల ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతోపాటు రాజకీయాలలో కూడా మహిళలను బలోపేతం చేసే దిశగా తెలుగుదేశం పార్టీ చేపట్టిన చర్యలు హర్షనీయం అన్నారు పార్టీ ఇచ్చిన గొప్ప ఇన్స్పిరేషన్తో మహిళలు రాజకీయాలలో కీలకంగా వ్యవహరించడం సాధ్యమైనదని అన్నారు తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు స్త్రీ శక్తి నిధి అమ్మ ఒడి ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ ఉచిత బస్సు డ్వాక్రా సంఘాలు వడ్డీ లేని రుణాలతో మహిళలను సూక్ష్మ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం అదేవిధంగా మహిళల పేరిట సొంత ఇల్లు రిజిస్ట్రేషన్లు, ఎన్టీఆర్ కల్పించిన మహిళలకు పిత్రార్జితంలోని ఆస్తిలో భాగం ఇవన్నీ కూడా మహిళలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశాయని వెల్లడించారు అంతేకాకుండా సమాజంలో మహిళలకు అరుదైన గౌరవం లభించడంలో టిడిపి పాత్ర గొప్పగా ఉందని అన్నారు మహానాడు స్త్రీ శక్తిని చాటే వేదికే కాకుండా మహిళల కు రాజకీయ పునర్జీవనం కోసమే కాకుండా వారి భవిష్యత్తుకు భరోసాగా తలెత్తుకు తిరిగే ఒక చైతన్య వేదికగా చెప్పుకో వచ్చున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి లోకేష్ కి ధన్యవాదాలు తెలిపారు.

# పచ్చదనం పెంపు ప్రజల బాధ్యత : ప్రత్తిపాటి

## ప్రతి ఇంటి ముందు చెట్లు పెంచితే వాతావరణం ప్రశాంతంగా, ఆహ్లాదంగా ఉంటుంది

## ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా పట్టణంలో మొక్కలు నాటిన ప్రత్తిపాటి

చిలకలూరిపేట , పెన్ పవర్, మే 27 : చిలకలూరిపేట : పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగానే ప్రభుత్వం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందని. దానిలో భాగంగానే ఈ నెల 23 నుంచి జూన్ 16 వరకు 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' చేపట్టిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. బుధవారం ఆయన పట్టణంలో స్థానిక మున్సిపల్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో పాల్గొన్నారు. మునిసిపాలిటీ సిబ్బందితో కలిసి మొక్కలు నాటిన అనంతరం ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఇంటి ముందు ఒక మొక్కనాటి, దాన్ని పెంచాలని పట్టణంలోని కుటుంబాలకు తెలియచేశామని, పచ్చదనం పెంచడాన్ని ప్రజలు తమ బాధ్యతగా నిర్వర్తించాలని ప్రత్తిపాటి సూచించారు. పచ్చనిచెట్లు ఉంటే వాతావరణం ప్రశాంతంగా, ఆహ్లాదంగా ఉంటుందని, ఎండల ప్రభావం నుంచి ప్రజలకు ఉపశమనం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వార్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, టీడీపీ నాయకులు తుబాటి శ్రీహరి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు పాములపాటి శివకుమారి, రాయని హరిత, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి, డిఇ అబ్దుల్ రహీమ్, టీడీపీ, నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# మహానాడుకు వర్చువల్‌గా 7.5 లక్షల మంది హాజరు

అమరావతి : పెన్ పవర్, మే, 27 హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించిన టిడిపి మహానాడుకు 7.5 లక్షల మంది హాజరయ్యారని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. తొలిరోజు మహానాడు ముగిసిన అనంతరం ఆయన పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. హైబ్రిడ్ విధానంలో నిర్వహించుకున్న ఈ కార్యక్రమానికి 1,875 క్లస్టర్ల నుంచి 7.5 లక్షల మంది హాజరుకావటం రికార్డు అని అన్నారు. మహానాడు తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీక అని తెలిపారు. టిడిపి నేతలు, కార్యకర్తల ఐక్యతను చూసుకుని వైసిపి నేతలు ఆందోళన చెందుతున్నారని విమర్శించారు. కార్యకర్తలుగా ఉన్నవారు నాయకులుగా ఎదిగేందుకు కృషి చేస్తున్నట్లు మహానాడు ప్రసంగాల ద్వారా అర్థమైందని తెలిపారు. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థంగా ఎదుర్కొనేలా ప్రతి కార్యకర్త, నేతలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

పలు తీర్మానాలు ఆమోదించిన మహానాడు

టిడిపి మహానాడు పలు తీర్మానాలను ఆమోదించింది. మహిళా సాధికారత తీర్మానాన్ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష్ ప్రవేశపెట్టగా.. పొలిట్‌బ్యూరో సభ్యులు గంట్యాడ శ్రీదేవితో పాటు కార్యకర్త మీరా నేతాజీ బలపరుస్తూ ప్రసంగించారు.

# ఘనంగా టిడిపి మహానాడు

## ముఖ్య అతిథులుగా శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్



చిలకలూరిపేట , పెన్ పవర్, మే 27 : చిలకలూరిపేట : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఆంధ్రుల ఆరాధ్య దైవం, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జన్మదినాన్ని పురస్కరించుకొని, పార్టీ ఆదేశాల మేరకు పలనాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట భువనచంద్ర టౌన్ హాల్ నందు టిడిపి ప్రతిష్టాత్మక ఉత్సవం "మహానాడు పసుపు జాతర--2026" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్, నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ జానీ సైదా, మరియు డాక్టర్ కోడెల శివరాంలు హాజరయ్యారు. ఉత్సవాల ప్రారంభంలో భాగంగా నాయకులు ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు, అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఇంధన కొరత, ఆర్థిక ఒత్తిడి పరిస్థితుల నేపథ్యంలోఇంధన పొదుపు, ఆర్థిక క్రమశిక్షణ పాటించాలంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం మహానాడును తొలిసారిగా వర్చువల్ విధానంలో నిర్వహించారు. ఈ మేరకు టౌన్ హాల్‌లో ఏర్పాటు చేసిన వర్చువల్ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. కేంద్ర పార్టీ కార్యాలయం నుండి జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ తదితర అగ్రనాయకులు అందించిన సందేశాలను ఈ సందర్భంగా వీక్షించారు. అనంతరం పార్టీ ప్రవేశపెట్టిన పలు కీలక తీర్మానాలను అభినందిస్తూ సభలో ఉన్నవారంతా ఏకగ్రీవంగా తమ మద్దతును ప్రకటించారు.

# మహిళా సాధికారతకు టిడిపి ప్రాధాన్యత



పి.గన్నవరం :పెన్ పవర్, మే, 27 మహిళా సాధికారతకు టిడిపి ప్రాధాన్యమిస్తుందని టిడిపి జిల్లా అధ్యక్షులు గుత్తుల సాయి అన్నారు. పి.గన్నవరం మండలం నాలుగు క్లస్టర్ల పరిధిలో బుధవారం జరిగిన డిజిటల్ మహానాడులో ఎంపీ హరీష్‌మాధుర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, టిడిపి మండల అధ్యక్షురాలు ప్రత్తిపాటి ఉమామహేశ్వరిలతో కలికి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి డిజిటల్ మహానాడును ప్రారంభించారు. పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తలకు ఎన్టీఆర్ అందించిన ప్రేరణను గుర్తు చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తే టిడిపికి అసలైన బలం అన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని వివరించారు. మహానాడు కేవలం రాజకీయ సమావేశం మాత్రమే కాదని, పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై చర్చించే మహా వేదిక అని ఎంపీ హరీష్ మాధుర్ పేర్కొన్నారు.

మండల టిడిపి అధ్యక్షురాలు ఉమామహేశ్వరి మాట్లాడుతూ "స్త్రీ శక్తి" అంశాన్ని ప్రధాన థీమ్‌గా తీసుకుని నిర్వహించిన కార్యక్రమాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమన్నారుహిళా సాధికారతకు టీడీపీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని ఆమె తెలిపారు. పార్టీ భవిష్యత్తు విజయాలకు కార్యకర్తల సమిష్టి కషి ఎంతోఅవసరమన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి మాజీ సభ్యులు డొక్కా నాథ్‌బాబు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చంద్రగిరిలో మహానాడు



చంద్రగిరి : పెన్ పవర్, మే, 27 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా వర్చువల్ విధానంలో మహానాడును తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి నారా లోకేష్, పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ లు ప్రారంభించారు. చంద్రగిరి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో అంగరంగ వైభవంగా పసుపు పండుగ "మహానాడు" కార్యక్రమంను నిర్వహిస్తున్నారు. ముందుగా పార్టీ జండా ఆవిష్కరించి, వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు విగ్రహానికి ఎమ్మెల్యే పులివర్తి నాని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చంద్రగిరి నియోజకవర్గంలో 6 మండలాలలో జరుగుతున్న మన ఈ పసుపు పండుగ మహానాడు 2026కు విచ్చేసిన ప్రతి ఒక్క కుటుంబ సభ్యులకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలలో జరిగే డిజిటల్ మహానాడుకు సతీమణి పులివర్తి సుధా రెడ్డి, కుమారుడు వినీల్ బాబు, తాను హాజరవుతున్నామని ఎమ్మెల్యే నాని తెలిపారు.

రూరల్ మండలం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జరిగిన మహానాడుకు విచ్చేసిన కార్యకర్తలు, అభిమానులను, నాయకులను పేరుపేరునా ఆప్యాయంగా పలకరించారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మన అధినాయకుడి ఆదేశానుసారం ఈ సంవత్సరం అన్ని రకాలుగా పొదుపు పాటిస్తూ డిజిటల్ పద్ధతిలో మన పసుపు పండుగ మహానాడు 2026 ను నిర్వహిస్తున్నామన్నారు .

# టాప్ 30 హాట్‌స్పాట్ మండలాలు

అమరావతి : పెన్ పవర్, మే, 27 ఖరీఫ్‌లో రైతులతో యూరియా వాడకాన్ని సాధ్యమైనంత మేరకు తగ్గించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్దేశం మేరకు రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ప్రారంభించిన స్పెషల్ డ్రైవ్ ముమ్మరమైంది. గతేడాది ఏప్రిల్ కంటే ఈ సంవత్సరం ఏప్రిల్‌లో ఎక్కువగా యూరియా విక్రయించిన పలువురు డీలర్లపై కేసులు, లైసెన్స్‌ల సస్పెన్షన్, రద్దు వంటి చర్యలకు పాల్పడిన విషయం తెలిసిందే. మరో అడుగు ముందుకేసి నిరుడు మే 18 నుంచి 24 మధ్య యూరియా అమ్మకాలతో ఈ సంవత్సరం అదే సమయంలో జరిగిన యూరియా అమ్మకాలతో పోల్చి చూసి, ఈ సంవత్సరం ఎక్కువ యూరియా అమ్మకాలు జరిగిన టాప్ 30 హాట్‌స్పాట్ మండలాలను గుర్తించారు. వివిధ జిల్లాల్లో ఉన్న ఈ మండలాల్లో అధికంగా యూరియా అమ్మకాలపై ప్రత్యేక దర్యాప్తును వ్యవసాయశాఖ చేపట్టింది.

# నాయుడుపేటలో ఘనంగా ప్రారంభమైన పసుపు పండుగ

## టిడిపి మహానాడుకు హాజరైన పలువురు నేతలు
## ఘనంగా ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు






నాయుడుపేట, పెన్ పవర్, మే 27నాయుడుపేట పట్టణంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో బుధవారం తెలుగుదేశం పార్టీ మహానాడు పసుపు పండుగ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో నాయుడుపేట పట్టణ,రూరల్ క్లస్టర్లకు సంబంధించి మహానాడు ఏర్పాట్లు చేశారు.రాష్ట్ర మహానాడును వర్చువల్ విధానంలో నిర్వహించనుండడంతో పార్టీ నేతలు,ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు మహానాడు కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు,పార్టీ నిర్ణయాలు,తీర్మానాలు,చర్చలను వీక్షించి తెలుసుకునేలా భారీ ఎల్ ఇ డి స్క్రీన్లు ఏర్పాటు చేశారు. మహానాడు ప్రారంభోత్సవం సందర్భంగా తొలుత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్రపటానికి, నాయుడుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ,నాయుడుపేట రూరల్ పార్టీ అధ్యక్షులు కె.అశోక్ కుమార్ రెడ్డి లతోపాటు తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి,పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పల్లమాల రామిరెడ్డి,పేరంశెట్టి శ్రీరాం ప్రసాద్,గూడూరు ప్రభావతమ్మ,నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,నానబాల సుబ్బారావు,చిట్టేటి చెంచయ్య,బిరదవాడ నారాయణ,మల్లాం రవికుమార్, పల్లేటి రమణయ్య,అవధానం సుధీర్,గూడూరు సుధీర్ రెడ్డి, నిత్య కృష్ణారెడ్డి,పోట్లపూడి రాజేష్,కాపులూరు చక్రపాణి, సుంకర కృష్ణయ్య,పలుకూరు ముత్యాలయ్య,జివిఆర్ నాయుడు,పరసా రాజా,జువ్వలపాటి మస్తాన్,బల్లి ముత్యాలయ్య,మొండెం బాబు,వినుకొండ ధనంజయ, ఆకుల కుబేరు మణి,ఇమ్మడిశెట్టి వెంకటేశ్వర్లు,చేవూరు చెంగయ్య వాకిరి వెంకటేశ్వర్లు,ముసునూరు కమలాకర్,దారా అంకయ్య, చెందేటి సుజాత,చిట్టేటి రేవతి,బందీల లక్ష్మి,పలువురు నాయకులు పాల్గొన్నారు.

# తెలుగు ప్రజల పసుపు పండుగ మహానాడు



పలమనేరు,పెన్ పవర్, మే 27 : తెలుగు ప్రజల పసుపు పండుగ మహానాడు కార్యక్రమమని గంగవరం మండల పార్టీ అధ్యక్షులు సోమశేఖర్ గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలు నందు నిర్వహించిన హైబ్రిడ్ మహానాడు కార్యక్రమానికి మండల పార్టీనాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్దఎత్తున పాల్గొని, ముందుగా పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం సోమశేఖర్ గౌడ్ మాట్లాడుతూ..ఈ సంవత్సరం భారతదేశ ప్రధాని నరేంద్రమోడీ పొదుపు సందేశం పిలుపు మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు పాటిస్తూ ప్రతి మండలంలోనే మహానాడు నిర్వహించడం జరుగుతోందన్నారు.ప్రతి సంవత్సరం లాగే మన అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారన్నారు.అలాగే గురువారం కూడా ఇదేవిధంగా కార్యక్రమం ఉంటుందని ఆయన అన్నారు.ఇందులో మండల కార్యదర్శి ప్రతాప్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న,సీనియర్ నాయకులు వెంకట రమణరెడ్డి,న్యాయవాది ఎల్.భాస్కర్,సింగిల్ విండో అధ్యక్షులు ప్రసాద్ నాయుడు, మాజీ సర్పంచ్లు మురళి,శ్రీనివాసులు,బత్తిగౌడ్,రెడ్డిశేఖర్, సింగిల్ విండో డైరెక్టర్లు హరిబాబు,శివరాం రెడ్డి(రాము),గంగవరం అధ్యక్ష,కార్యదర్శులు ఆనంద్ నాయుడు, బాలాజీ,తెలుగు యువత గిరిధర్ గోపాల్,చీలావారిపల్లె శ్రీనివాసులు,అశోక్,చరణ్ తదితరులు పాల్గొన్నారు.


# డ్రంక్ అండ్ డ్రైవ్ పది వాహనాల పై కేసులు....సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం శ్రీనివాసరావు..



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ మే 27. బుచ్చిరెడ్డిపాలెం మండలంలో శ్రీ శ్రీనివాసరావు తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించారు ఈ వాహనాల తనిఖీలలో మద్యం సేవించిన, రేయిన పత్రాలు లేని పది వాహనాలపై కేసులు నమోదు చేశారు ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాహనాలకు సరైన పత్రాలతో, హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు మద్యం సేవించి, త్రిబుల్ రైడింగ్ వాహనాలకు ప్రత్యేక సైలెన్సర్లు అధిక స్పీడ్ వెళ్లే వాహనాలపై కఠినమైన చర్యలు తీసుకుంటామని వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని ఆయన తెలిపారు వాహనాలు నడిపేటప్పుడు తమ తల్లిదండ్రుల కుటుంబ పరిస్థితులను మనసులో పెట్టుకుని వాహనాలను నడపాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# బక్రీద్ పండుగకు పట్టణంలో గోవధ నిషేధం




పలమనేరు,పెన్ పవర్, మే27: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ నిభంధలన మేరకు 28వ తేదీ గురువారం బక్రీద్ పండుగ సందర్భముగా గోవధను నిషేదిస్తూ జి.ఓ.147 విడుదల చేసినట్లు బుధవారం మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు.కావున పట్టణములోని చికెన్, మటన్ యజమానులు గోవధ చేయరాదని, ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.ఇందుకు రూ.5వేల నుండి రూ.15వేల రూపాయల వరకు జరిమానా విధించ బడుతుందని ఆయన అన్నారు.

# మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ




పలమనేరు,పెన్ పవర్, మే 27: మున్సిపల్ పరిధిలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి అన్నారు. స్వర్ణ ఆంధ్ర,స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా బుధవారం పట్టణము లోని అన్నా క్యాంటీన్, ఎంబీటీ రోడ్డు, శివాలయం వీధి పరిసర ప్రాంతాలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరింత మెరుగైన పారిశుధ్య నిర్వహణకై తగు చర్యలు తీసుకుంటున్నామని, పారిశుధ్య కార్మికులు మరియు శానిటరీ సెక్రెటరీల ద్వారా ఎప్పటికప్పుడు క్లీనింగ్, ఫోగ్గింగ్,బ్లీచింగ్ మరియు కాలువల పూడికతీత పనులు చేపడుతున్నామని అన్నారు.ప్రభుత్వము పారిశుధ్యానికి మరియు ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందని మరియు ప్రజల ఆరోగ్య ప్రమాణాల విషయమై మరింత కృషి చేస్తుందన్నారు.ప్రజలందరూ ప్లాస్టిక్ కి బదులు బట్ట సంచులు,పేపర్ సచులను విరివిగా ఉపయోగించాలన్నారు.ఇందులో సానిటరీ ఇన్స్పెక్టర్ బాబురెడ్డి నాయక్,పురపాలక సంఘ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రచయితలే చీకటి జీవితాలను వెలుగులోకి తెస్తారు



పలమనేరు,పెన్ పవర్,మే 27: రచయితలే చీకటి జీవితాలను వెలుగులోకి తెస్తారని ప్రముఖ రచయిత శిరంశెట్టి కాంతారావు అన్నారు. బుధవారం గంగవరం మండలంలోని కళామందిరం నందు జరిగిన రచయితల ఇష్టాగోష్టి కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా పాల్వంచ కు చెందిన ప్రముఖ రచయిత,తెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కార గ్రహీత శిరంశెట్టి కాంతారావు ముఖ్యఅతిథిగా పాల్గొని తన కథలు,నవలలు నేపథ్యాన్ని వివరించారు. మరొక ప్రముఖ రచయిత వంకిరెడ్డి రెడ్డప్పరెడ్డి సమాజంలో జరుగుతున్న ఆర్థిక నేరాలు ఆర్థిక మోసాలకు సంబంధించి తన పరిశోధన అంశాలనే కథలుగా రాశానని చెప్పారు. సమాజంలో అనేక అన్యాయాలతో పాటు ఆర్థిక మోసాలకు గురవుతున్న సామాన్యుల వ్యథలను, వ్యక్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి రచయితలు ఇంకా విస్తృతంగా రచనలు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు.ఇందులో రచయితలు శిరంశెట్టి కాంతారావు దంపతులను,వంకిరెడ్డి రెడ్డెప్పరెడ్డిని గంగవరం ఎంఈఓ2 శ్రీనివాసులు, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష కార్యదర్శులు పి.తులసినాథం నాయుడు,పుష్ప, పలమనేరు రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు ఆర్.మాధవ్,కోశాధికారి డాక్టర్ మల్లిచెట్ల దేవేంద్ర,ప్రముఖ రచయిత జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, జనవిజ్ఞానవేదిక జిల్లా నాయకులు గిరిధర్ మూర్తి,డాక్టర్ రజని, రాజశేఖర్,ప్రణవి, సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో ఘనంగా మహానాడు వేడుకలు..!






(పెన్ పవర్ ప్రతినిధి వింజమూరు. 27) నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో ఉదయగిరి శాసనసభ్యులు శ్రీ కాకర్ల సురేష్ గారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహానాడు వేడుకలు అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలోని మొత్తం 10 క్లస్టర్లలో రెండు రోజుల పాటు వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమాలను నిర్వహించేందుకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టారు. పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని మహానాడు వేడుకలకు ప్రత్యేక ఉత్సాహాన్ని తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వింజమూరు మండలం బొమ్మరాజు చెరువు గ్రామంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో (క్లస్టర్-5) ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గారు పార్టీ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి, పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమం మొత్తం పార్టీ పట్ల ఉన్న అభిమానం, నాయకత్వంపై విశ్వాసాన్ని ప్రతిబింబించేలా సాగింది. ఈ ఏడాది "స్త్రీ శక్తి" అనే ప్రధాన థీమ్‌తో నిర్వహిస్తున్న మహానాడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళా సాధికారత, మహిళల రాజకీయ భాగస్వామ్యం, అభివృద్ధిలో వారి పాత్ర వంటి అంశాలను ప్రధానంగా చర్చిస్తూ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి హైబ్రిడ్ మోడల్‌లో ప్రత్యక్ష ప్రసారం జరుగుతుండగా, ప్రతి క్లస్టర్‌లో ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడి స్క్రీన్ల ద్వారా కార్యకర్తలు, నాయకులు కలిసి మహానాడు కార్యక్రమాలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మండల స్థాయి ప్రతినిధులు, మహిళా నాయకులు, యువత మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని మహానాడు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొనగా, మహానాడు వేడుకలు రాజకీయంగా ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

# ముస్లిం సోదరులందరికి బక్రీద్ శుభాకాంక్షలు :కావలి శాసనసభ్యులు కావ్య క్రిష్ణారెడ్డి..



కావలి పెన్ పవర్( స్టాఫ్ రిపోర్టర్ ) మే:27 బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులందరికి కావలి శాసనసభ్యులు కావ్య క్రిష్ణారెడ్డి ఒక ప్రకటనలో బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగాలకు ప్రతీక అయిన ఈద్ అల్ అదా (బక్రీద్) పండుగను ముస్లీం సోదరులందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ దేవుని పై విశ్వాసం ఉంచి సన్మార్గంలో జీవించాలని ఈద్ అల్ అదా తెలియజేస్తుందని, తమకు ఉన్నదాంట్లో నుంచి ఇతరులకు పంచి పెట్టే దాతృత్వ స్ఫూర్తిని బక్రీద్ కలుగజేస్తుందన్నారు.ముస్లింలందరూ ఈ పండుగను సంతోషంగా నిర్వహించుకోవాలని,రాష్ట్ర, కావలి నియోజకవర్గం ప్రజలపై ఆ అల్లా ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

# జూన్ 15 నుంచి ఏపీలో సర్

**విజయవాడ, మే 27 పెన్ పవర్:** రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4.16 కోట్ల మంది ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి భారీ యంత్రాంగాన్ని రంగంలోకి దించుతున్నారు. మొత్తం 46,397 మంది బూత్ స్థాయి అధికారులు జూన్ 15 నుంచి జూలై 14 వరకు నేరుగా ఓటర్ల ఇళ్ల వద్దకే వచ్చి సర్వే నిర్వహిస్తారుఈ ఎన్యుమరేషన్ ప్రక్రియలో రాజకీయ పార్టీల తరఫున నియమించిన 68,868 మంది బూత్ స్థాయి ఏజెంట్లు (BLAs) కూడా బీఎల్‌వోలకు సహాయకరంగా వ్యవహరిస్తారు. నకిలీ ఓట్ల తొలగింపు, మరణించిన వారి పేర్లను తొలగించడం, కొత్త ఓటర్ల చేరికను పారదర్శకంగా చేపట్టడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశం.

**ఓటర్ల జాబితా సవరణ – ముఖ్యమైన తేదీలు:**

జూన్ 6 నుంచి జూన్ 14 వరకు : ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లు, అధికారులకు శిక్షణ అవసరమైన ఫారాల ప్రింటింగ్ ప్రక్రియ జరుగుతుంది.

జూన్ 15 నుండి జూలై 14 వరకు : బీఎల్‌వోల ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే జరుగుతుంది. ఇదే సమయంలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా జూలై 14 లోగా పూర్తి చేస్తారు.

జూలై 2 1: సేకరించిన ప్రాథమిక వివరాల ఆధారంగా ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రచురిస్తారు.

జూలై 21 నుండి ఆగస్టు 20 వరకు: ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు తెలపడానికి, కొత్తగా ఓటు హక్కు కోసం క్లెయిమ్‌లు దాఖలు చేయడానికి ఓటర్లకు అవకాశం కల్పిస్తారు.

జూలై 21 నుండి సెప్టెంబరు 18 వరకు : వచ్చిన క్లెయిమ్‌లు, నోటీసులు మరియు అభ్యంతరాలన్నింటినీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తారు.

సెప్టెంబరు 22 : అన్ని సవరణలు పూర్తి చేసిన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తుది ఓటర్ల జాబితానుఅధికారికంగా విడుదల చేస్తారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అనేది ఓటర్లు, రాజకీయ పార్టీలు, ఎన్నికల అధికారులు అందరూ భాగస్వాములు కావాల్సిన ఒక కీలకమైన ప్రక్రియ అని సీఈవో వివేక్ యాదవ్ పేర్కొన్నారు. ఈ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా మరియు లోపాలు లేకుండా జరగాలనేదే ఎన్నికల సంఘం లక్ష్యమని ఆయన వివరించారు. రాష్ట్రంలోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో తమ బూత్ స్థాయి ఏజెంట్లను ) తప్పనిసరిగా నియమించాలని.... ఎన్నికల సిబ్బందికి పూర్తి స్థాయిలో సహకరించి ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వివేక్ యాదవ్ కోరారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## బీజేపీకి వైసీపీ ఫ్రెండ్లీ వార్నింగ్?

**విజయవాడ, మే 27 పెన్ పవర్: :** రాజకీయాల్లో ఏ చర్య వెనుకైనా ఒక బలమైన వ్యూహం, ఆశించిన లక్ష్యం ఉంటాయి. ఏపీలో ప్రస్తుతం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్రంపై చేపట్టిన నిరసనలు ఈ కోవలోకే వస్తాయి. రాష్ట్రానికి సంబంధించిన స్థానిక సమస్యలపై పెద్దగా గళమెత్తని వైసీపీ, ఒక్కసారిగా పెట్రోల్ ధరల పెంపుపై రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపునివ్వడం వెనుక లోతైన రాజకీయ వ్యూహం దాగి ఉందన్న అభిఇప్రాయం వినిపిస్తోంది. పెట్రోల్ ధరల పెంపు అనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశం అయినప్పటికీ.. వైసీపీ నేతలు మాత్రం ఎక్కడా ప్రధాని మోదీని గానీ, కేంద్ర బీజేపీ నాయకత్వాన్ని గానీ విమర్శించడం లేదు. కేవలం రాష్ట్ర ప్రభుత్వంపైనే విమర్శల బాణాలు ఎక్కుపెడుతున్నారు. అడ్రస్ కేంద్రానిది అయితే, దాన్ని రాష్ట్రం మీదకు మళ్లించడం వెనుక ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్న చందంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్లాన్ ఉన్నట్లు భావిస్తున్నారు.వైసీపీ ఇస్తున్న ఈ సిగ్నల్స్ వెనుక ప్రధాన ఉద్దేశం.. తాము కేంద్రానికి వ్యతిరేకం కాదని, కానీ అవసరమైతే తమ దారి తాము చూసుకుని బీజేపీకి వ్యతిరేకంగా పోరాడగల సత్తా తమకు ఉందని నిరూపించడమే . ఢిల్లీ స్థాయిలో బీజేపీతో సత్సంబంధాలు కొనసాగిస్తూనే, రాష్ట్రంలో మిత్రపక్షంగా ఉన్న టీడీపీ–జనసేన కూటమిని ఇరుకున పెట్టడం ఈ వ్యూహంలోని ప్రధాన భాగం. మేము కేంద్రాన్ని ఏమీ అనడం లేదు, కానీ మీరు తగ్గించొచ్చు కదా అనే ప్రశ్న ద్వారా ప్రజల్లో అధికార కూటమిపై వ్యతిరేకత పెంచడమే వైసీపీ లక్ష్యం. ఇది బీజేపీకి పంపుతున్న ఒక రకమైన సాఫ్ట్ సిగ్నల్ .రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ నేతలు వరుసగా కేసులు ఎదుర్కొంటున్నారు. ఈ తరుణంలో కేంద్రంలోని బీజేపీ అగ్రనాయకత్వం అండ ఉంటేనే తాము సురక్షితంగా ఉంటామని వైసీపీ భావిస్తోంది. అందుకే డైరెక్ట్ గా కేంద్రంతో యుద్ధం పెట్టుకోకుండా.. రాష్ట్రానికి సంబంధించిన సెస్, వాట్ అంశాలను సాకుగా చూపిస్తూ నిరసనలు చేపడుతున్నారు. ఇలా చేయడం వల్ల కేంద్రానికి కోపం రాదు, అదే సమయంలో రాష్ట్రంలో తాము ప్రతిపక్షంగా యాక్టివ్ గా ఉన్నామనే సంకేతం కేడర్ కు వెళ్తుంది.ఒకవేళ మోదీపై నేరుగా విమర్శలు చేస్తే, సంబంధాలు దెబ్బతింటాయి. భవిష్యత్తులో సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి ఎదురయ్యే సవాళ్లను తట్టుకోవడం కష్టమవుతుందని వైసీపీకి తెలుసు. అందుకే, నిరసనల నినాదాన్ని కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర పన్నుల వైపు మళ్లించారని అంచున్నారు. పెట్రోల్ ధరల్లో ఏపీ నంబర్ వన్ అని ప్రచారం చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికే చెడ్డపేరు వచ్చేలా చేస్తున్నారు తప్ప, ధరలు పెంచిన కేంద్రానికి ఏమీ కాకుండా జాగ్రత్త పడుతున్నారు. వైసీపీ చేస్తున్న ఈ పెట్రోల్ నిరసనలు కేవలం ధరల కోసమే అని అనుకుంటే పొరపాటే. ఇది పక్కాగా ఢిల్లీ పెద్దల మనసు గెలుచుకుంటూనే, గల్లీలో ఉన్న ప్రత్యర్థులను దెబ్బకొట్టే డబుల్ యాక్షన్ ప్లాన్. కేంద్రం పట్ల మౌనం పాటిస్తూ, రాష్ట్రంపై గగ్గోలు పెట్టడం వెనుక ఉన్న ఈ రాజకీయ చాణక్యం రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయాల్లో ఎలాంటి మార్పులు తెస్తుందో వేచి చూడాలి.

## బాలినేని కోసం రంగంలోకి పవన్

**ఒంగోలు, మే 27, పెన్ పవర్:** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీవ్ర నిర్ణయాలు దిశగా అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా కొత్తవారి చేరికలతో పార్టీని మరింత బలోపేతం చేయాలని చూస్తున్నారు. అయితే ఈ చేరికల విషయంలో జనసేన నేతలు అనుసరిస్తున్న వైఖరిపై పవన్ ఆగ్రహంగా ఉన్నారు. పార్టీని అభివృద్ధి చేయాలంటే చేరికలను ప్రోత్సహించాల్సిందేనని తేల్చి చెప్పారు. అయితే ఇటీవల కొన్ని జిల్లాల్లో పార్టీ క్రమశిక్షణ కట్టు దాటుతోంది. దీంతో పవన్ కళ్యాణ్ నిర్ణయాలు దిశగా అడుగులు వేస్తున్నారు ఆ జిల్లాలపై. అందులో భాగంగా ప్రకాశం జిల్లా పార్టీ కార్యవర్గాన్ని రద్దు చేశారు. అక్కడ పార్టీ నేతలు అనుసరిస్తున్న తీరును తప్పు పట్టారు. ఒక నేతపై సస్పెన్షన్ వేటు కూడా వేశారు. పార్టీలో ఉంటే ఉండండి లేకపోతే వెళ్లిపోండి అంటూ తేల్చి చెప్పడం విశేషం. ఇటీవల జరిగిన పరిణామాలతోనే పవన్ సీరియస్ గా స్పందించినట్లు తెలుస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పి జనసేనలో చేరారు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి. ఆయన సీనియర్ మోస్ట్ లీడర్ కూడా. కానీ ఆయన రాకను ప్రకాశం జిల్లా నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చివరకు అధినేత పవన్ కళ్యాణ్ చెప్పిన వారి వైఖరి మారడం లేదు. దీంతో అధినేత తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. క్రమంలోనే నిన్న జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ప్రకాశం జిల్లా నేతలను ప్రత్యేకంగా పిలిపించుకున్నారు. అయితే ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ రియాజ్ ఈ సమావేశానికి హాజరు కాలేదు. ఆయన మాజీ మంత్రి బాలినేని రాకను వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల బాలినేనికి జనసేన డీలిమిటేషన్ కమిటీ లో చోటు ఇచ్చారు. అధినేత ఆదేశాల మేరకు రాయలసీమతో పాటు ఒంగోలు, నెల్లూరు జిల్లా నేతలతో సమావేశం అయ్యారు బాలినేని. అక్కడ ఓ నేత బాహాటంగానే విమర్శలు చేశారు బాలినేని పై. దీనిపై తాజాగా స్పందించిన పవన్ సదరు నేతపై వేటు వేశారు. అంతటితో ఆగకుండా ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన కార్యవర్గాన్ని రద్దు చేశారు. నియోజకవర్గ ఇన్చార్జి లతోపాటు వివిధ విభాగాల ప్రతినిధులను సైతం పదవుల నుంచి తొలగించారు. కొత్త కమిటీలను ఏర్పాటు చేయడం ద్వారా మాజీ మంత్రి బాలినేనికి కీలక బాధ్యతలు కట్టబెట్టనున్నట్లు సంకేతాలు పంపారు.ఇటీవల బాలినేని విషయంలో వైఖరి మారుతోంది పవన్ కళ్యాణ్ కు. మొన్ననే ఆయన సీఎం చంద్రబాబును సైతం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. బాలినేని రాకను టిడిపి ఎమ్మెల్యే వ్యతిరేకిస్తున్నారు. అదే సమయంలో జనసేన క్యాడర్ సైతం వ్యతిరేకిస్తోంది. ఒంగోలు కార్పొరేషన్ నుంచి 26 మంది కార్పొరేటర్ లను జనసేనలో చేర్పించారు బాలినేని. అయినా సరే జిల్లా అధ్యక్షుడిగా ఉన్న రియాజ్ సరైన గుర్తింపు ఇవ్వడం లేదు. వాస్తవానికి బాలినేని వైసీపీ నుంచి రావడంతో ఆయనపై అనుమానపు చూపులు ఉండేవి. పని జిల్లా జనసేన నేతలు వైఖరి చూస్తుంటే వారి వెనుక వైసిపి ఉన్నట్టు అర్థం అవుతుంది. కేవలం బాలినేని అడ్డుకోవాలని రీతిలో వైసిపి నాయకత్వం స్థానిక జనసేన నేతలతో ఇలా వ్యవహరిస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. పవన్ కళ్యాణ్ వరకు వెళ్లడంతో ఆయన కమిటీలన్నింటినీ రద్దు చేశారు. ఇకనుంచి బాలినేనికి జిల్లా బాధ్యతలు కట్టబెట్టే అవకాశం ఉంది. టిడిపి పరంగా కూడా బాలినేనిపై ఇకనుంచి అభ్యంతరాలు రాకపోవచ్చు. ఎందుకంటే బాలినేని ఒంగోలు విడిచి దర్శి వైపు అడుగులు వేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. మొత్తానికైతే పరిస్థితులు చూస్తుంటే మాజీ మంత్రి బాలినేనికి అనుకూలంగా ఉన్నట్లు కనిపిస్తున్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## ఎండలకు మాడిపోతున్న కోళ్లు...

**ఏలూరు, మే 27, పెన్ పవర్:** ఏపీలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలకుతోడు వేడిగాలులతో ప్రజలు మధ్యాహ్నం వేళ బయటకు వచ్చేందుకు భయాందోళనకు గురవుతున్నారు. మరోవైపు ఫౌల్ట్రీ ఫారాల్లో పెద్ద సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఉన్నట్లుండి కుప్పకూలిపోయి చనిపోతుండటంతో పౌల్ట్రీ పరిశ్రమకు తీవ్ర సంక్షోభం ఏర్పడింది.ఏపీ తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో 48.3డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ సీజన్లోనే అత్యధికమని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అయితే, వచ్చే మూడు రోజుల పాటు రాష్ట్రంలో ఎండల తీవ్రత ఎక్కువగానే ఉంటుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు రావొద్దని హెచ్చరికలు జారీ అయ్యాయి.ఏపీలో భారీగా పెరుగుతున్న ఎండల తీవ్రత, వడగాలులు కారణంగా పౌల్ట్రీ పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో వేసవి వేడి తట్టుకోలేక గత కొన్ని రోజుల్లో లక్షలాది కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఆదివారం ఒక్కరోజు రాష్ట్ర వ్యాప్తంగా 10లక్షల కోళ్లు మృత్యువాత పడటం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో మూడు లక్షలకుపైగా కోళ్లు మరణించాయి. దీంతో కోడి గుడ్ల ఉత్పత్తి భారీగా పడిపోయింది.రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రమైన ఉష్ణోగ్రతలు, ఉక్కపోత కారణంగా గడిచిన వారంరోజుల్లో దాదాపు 18 నుంచి 20 లక్షల కోళ్లు చనిపోయినట్లు పౌల్ట్రీ పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. విపరీతమైన వేడి వల్ల బతికున్న కోళ్లు కూడా సరిగా మేత తినడం లేదని పౌల్ట్రీ రైతులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 నుండి 48 డిగ్రీల వరకు నమోదు కావడమే ఈ దారుణ పరిస్థితికి ప్రధాన కారణంగా పౌల్ట్రీ రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎండలు బర్డ్‌ఫ్లూ వైరస్ కంటే తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తున్నాయని పౌల్ట్రీ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పవన్ సరే.. బిజెపి సంగతేంటి!?

**కాకినాడ, మే 27 పెన్ పవర్:** ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యవహారంపై స్పందించారు పవన్ కళ్యాణ్. అమిత్ షా లాంటి గొప్ప వ్యక్తిని కలిసినప్పుడు అరెస్టులు గురించి ప్రస్తావిస్తామా? అని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అంతటి పెద్దలను కలిసి విన్నవిస్తే.. ఇలా విశ్లేషించడం ఏంటని గట్టిగానే నిలదీశారు పవన్ కళ్యాణ్. అయితే ఇంతటి నిందారోపణలు పవన్ పై రాగా.. బిజెపి వ్యూహాత్మక మౌనం పాటించడం మాత్రం కూటమి ధర్మానికి విఘాతం కలిగిస్తోంది. తిరిగి బిజెపి పైనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బిజెపి సైలెన్స్ ఎంతలా అంటే.. వైసిపి విషయంలో సాఫ్ట్ కార్నర్ అన్నట్టు ప్రజల్లోకి సంకేతాలు వెళ్తోంది. ఈ మొత్తం ఎపిసోడ్ పై కూటమిలోని రెండు పార్టీలు గట్టిగా నిలదీస్తుండగా.. బిజెపి మాత్రం మౌనం వహిస్తోంది.ఆది నుంచి బిజెపి వైయస్సార్ కాంగ్రెస్ విషయంలో సాఫ్ట్ కార్నర్ తో ఉందన్న టాక్ ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా దానిని బాగా హైలైట్ చేస్తోంది. తద్వారా తప్పనిసరి పరిస్థితుల్లోనే బిజెపి టిడిపి తో కలిసిందని.. అవసరమైన పక్షంలో వైసీపీ నుంచి పరస్పర రాజకీయ ప్రయోజనాలు అందుకునేందుకు సిద్ధంగా ఉందని ప్రచారం మొదలుపెట్టారు. జగన్మోహన్ రెడ్డి విషయంలో బిజెపి ఉదాసీనంగా ఉందని చెప్పడానికి ఆయన బెయిల్ రద్దు, వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణలో జాప్యం వంటి వాటిని ఎక్కువగా ప్రస్తావిస్తున్నారు విశ్లేషకులు. ఈ క్రమంలోనే ప్రొఫెసర్ నాగేశ్వర్ ఏకంగా పవన్ కళ్యాణ్ పై బాంబు పేల్చారు. అందుకు జనసేనతో పాటు పవన్ రియాక్ట్ అయ్యారు. కానీ టిడిపి విషయంలో బిజెపి ఆలోచన అది అని.. జగన్మోహన్ రెడ్డి శాశ్వత మిత్రుడు బిజెపి కని చెప్పారు ప్రొఫెసర్ నాగేశ్వర్. దానిని ఖండించాల్సిన అవసరం బిజెపికి ఉంది. లేకుంటే అదే నిజం అని జనాలు నమ్మక తప్పదు.ప్రొఫెసర్ నాగేశ్వర్ కమ్యూనిస్టు భావజాలం ఉన్న వ్యక్తి. పైగా ఆధారాలు లేకుండా బిజెపి అగ్రనేత ఆదేశాలు అన్నట్టు మాట్లాడారు. దానిని ఖండించాల్సిన బీజేపీ నేతలు ఇప్పుడు అదే నాగేశ్వర్ ను సమర్ధిస్తున్నారు. తెలంగాణ బిజెపి నేత మురళీధర్ రావు ప్రొఫెసర్ నాగేశ్వర్ మంచి విశ్లేషకుడు అన్నట్టు కితాబు ఇచ్చారు. ఆయన తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకున్న తర్వాత కూడా పోలీస్ కేసు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు. దీంతో నాగేశ్వర్ చెప్పింది నిజమే అన్నట్టు సంకేతాలు ఇచ్చారు. అయితే ఆది నుంచి బిజెపి విధానం ఇదే. ఏపీతో వింత రాజకీయం ఆడుతోంది. ఇక్కడున్న రాజకీయ పరిస్థితులకు తగ్గట్టు వ్యవహరించి రాజకీయ లబ్ధి పొందుతోంది. ప్రొఫెసర్ నాగేశ్వర్ ఎపిసోడ్లో మాత్రం బిజెపి వైఖరి ఇప్పుడు అంతటా చర్చ నడుస్తోంది.



ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.. తన సహచర మంత్రి నాదెండ్ల మనోహర్ తో ఢిల్లీ వెళ్లారు.. అక్కడ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తో భేటీ అయ్యారు. అక్కడ వారి మధ్య ఏం జరిగిందో తెలియదు. కాకపోతే 25 నిమిషాల పాటు మాట్లాడుకున్నారు. ఏం మాట్లాడుకున్నారో తెలియకపోయినాప్పటికీ.. మీడియాకు మాత్రం వచ్చే ఎన్నికల్లో కూడా మూడు పార్టీలు కలిసి పోటీ చేయాలని.. ఏపీ రాష్ట్రాన్ని బాగు చేయాలని చర్చించుకున్నట్లు చెప్పారు. ఇది ఇలా ఉంటే ప్రముఖ విశ్లేషకుడు ప్రొఫెసర్ నాగేశ్వర్ మాత్రం మరో విధంగా చెప్పారు. జగన్మోహన్ రెడ్డిని అరెస్ట్ చేయాలని అమిత్ షా ముందు పవన్ కళ్యాణ్ ప్రతిపాదన తెచ్చారని.. దానికి ఆయన ఒప్పుకోలేదని.. జగన్మోహన్ రెడ్డిని తమ లాంగ్ టర్మ్ పొలిటికల్ ఫ్రెండ్ గా భావిస్తున్నట్టు అమిత్ షా చెప్పారని.. నాగేశ్వర్ అన్నారు.నాగేశ్వర్ అన్న ఈ మాటలు క్యాజువల్ గానే ఉండవచ్చు. పాలిటిక్స్ ను అంతర్గతంగా స్టడీ చేసే వారికి వేరే విధంగా అనిపిస్తాయి . ప్రొఫెసర్ నాగేశ్వర్ నుంచి ఎప్పుడైతే ఈ మాటలు బయటికి వచ్చాయో.. అప్పుడే వైసిపి మీడియా అలర్ట్ అయిపోయింది. వెంటనే తన సోషల్ మీడియా ద్వారా.. మీడియా ద్వారా కావలసిన ప్రచారం చేసుకుంది. ఇది ఏపీ రాజకీయాలలో ఎంత మంట పుట్టించాలో అంత మంట పుట్టించింది. ఆ తర్వాత జనసేన రంగంలోకి వచ్చింది. టిడిపి.. బిజెపి ఇలా ఎదురుదాడి మొదలైంది. మొత్తంగా ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యవహారం మరో లైన్ తీసుకుంది.ఈ క్రమంలో నాగేశ్వర్ తనను తాను సెల్ఫ్ డిపెండ్ చేసుకుంటూ.. తాను తెలంగాణ ప్రాంత వాడినని.. ఆంధ్ర ప్రాంతానికి సంబంధించిన రాజకీయాలతో తనకేంటి అవసరమని వ్యాఖ్యానించారు. అవసరమైతే తనను అరెస్ట్ చేసుకోవాలని సవాల్ విసిరారు.. అంతకుముందు నాగేశ్వర్ ను అరెస్ట్ చేస్తే హైదరాబాదులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంటిని ముట్టడిస్తామని టిఆర్ఎస్ అధినేత్రి కవిత హెచ్చరించారు. మరోవైపు పవన్ కళ్యాణ్ కూడా నాగేశ్వర్ వ్యవహారంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.ఇష్టం వచ్చినట్టు మాట్లాడిన తర్వాత కులాన్ని.. ప్రాంతాన్ని ఆపాదించడం ఎంతవరకు కరెక్ట్ అని ఆయన ప్రశ్నించారు. రాజకీయాల్లోకి తాను అన్ని వదులుకొని వచ్చానని.. ఎదురు దాడికి దిగితే పరిస్థితి వేరే విధంగా ఉంటుందని హెచ్చరించారు.. పవన్ కళ్యాణ్ హెచ్చరించిన కొద్దిసేపటికి ప్రొఫెసర్ నాగేశ్వర్ స్పందించారు. తనను అరెస్ట్ చేసుకోవచ్చని.. దానికి సిద్ధంగా ఉన్నానని..క్వాష్ పిటిషన్ వేయలా వద్దా.. అనే దానిపై ఇంకా ఆలోచించుకోలేదని నాగేశ్వర్ పేర్కొన్నారు. . ఇప్పటికే నాగేశ్వర్ కు అనుకూలంగా వైసీపీ మీడియా.. బిఆర్ఎస్ మీడియా వ్యవహరిస్తున్నాయి. మధ్యలో కవిత కూడా సపోర్ట్ ఇస్తున్నారు. దీంతో ఈ వ్యవహారం రెండు ప్రాంతాలకు మధ్యదిగా మారిపోయింది. అయితే ఇది ఎక్కడి దాకా దారితీస్తుందో చూడాల్సి ఉంది.

# వైసీపీ నుంచి జంపింగ్స్...

**విజయవాడ, మే 27 పెన్ పవర్:** ఏపీలో ఎన్నో పార్టీలు ఉన్నాయి. కానీ ప్రధాన పార్టీలు మాత్రం కొన్నే ఉన్నాయి. అందులో మూడు అధికార కూటమిలో చేరిపోయాయి. టీడీపీ జనసేన బీజేపీ ఒక జట్టు కట్టాయి. ఒక అయిదేళ్ళ పాటు ఏపీని పాలించిన వైసీపీ విపక్షంలో ఉంది. విపక్షంలో చూస్తే కాంగ్రెస్ కమ్యూనిస్టు పార్టీలు కూడా ఉన్నాయి. కానీ ఇవేమీ ఏపీలో బలమైన పరిస్థితులలో లేవు. ఉనికి పోరాటం చేస్తున్నాయి. దాంతో విపక్షంలో బలంగా 40 శాతం ఓటు షేర్ తో ఉన్న ఏకైక పార్టీగా వైసీపీ ఉంది. అదృష్టం కలిసి వస్తే మరోసారి అందలం ఎక్కే పార్టీ కూడా వైసీపీ అవుతుందని అంటున్నారు. ఇదిలా ఉంటే గతంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ నుంచి ఫిరాయింపు నేతలు పదుల సంఖ్యలో పార్టీని వీడిపోయారు. వారంతా కూడా కూటమి వైపు వెళ్ళారు. అలా తెలుగుదేశం బీజేపీ జనసేనలలో చేరిపోయారు. మరి కొంతమంది వైసీపీని వీడి ఏ పార్టీలో చేరకుండా పరిస్థితిని గమనిస్తున్నారు. ఇదంతా కూడా తొలి ఏడాదిలోనే జరిగిపోయింది. ఆ తరువాత చూస్తే వైసీపీ నుంచి పెద్దగా జంపింగులు అయితే లేవు. దానికి కారణం వైసీపీని వీడి వెళ్ళిన వారు కూటమి పార్టీలలో సరైన ప్రాధాన్యత పొందకపోవడం. కండువా కప్పుకున్న రోజు తప్ప నాటి నుంచి నేటి వరకూ ఎక్కడా పెద్దగా కనిపించకపోవడమే. దాంతో మిగిలిన వారు కూడా పునరాలోచనలో పడ్డారు అని అంటున్నారుఇక చూస్తే రెండేళ్ళ కూటమి పాలన ముగిసింది. మరొ రెండేళ్ళు గట్టిగా కాలం కదిలితే చాలు చివరి ఏడాది ఎన్నికలు వచ్చేస్తాయి. రెండేళ్ళ తరువాత మెల్లగా యాంటీ ఇంకెంబెన్సీ అన్నది మొదలవుతుంది. దాంతో జనాభిప్రాయం ఏమిటి అన్నది కూడా వెల్లడి అవుతుంది. దానిని గ్రహిస్తూ ముందుకు సాగే వైసీపీ నేతలు ఎవరూ ఇక గడప దాటేది ఉండదని వైసీపీ పెద్దలు అంచనా వేసుకుంటున్నారు. వైసీపీలో ఉన్న వారు కూడా బయటకు వెళ్తే చేసేది ఏదీ లేదని కూడా ఒక నిర్ధారణకు వచ్చారని అంటున్నారు. ఇలా వైసీపీలో ఇపుడు ఉన్న నాయకులు అంతా కచ్చితంగా ఎన్నికల దాకా కొనసాగుతారు అని ధీమాగా వైసీపీ పెద్దలు ఉన్నారు.: ప్రాంతీయ పార్టీలు అన్నీ అధినేత ఫేస్ చూసి మాత్రమే మనుగడ సాగిస్తూ ఉంటాయి. అలా జగన్ ఇమేజ్ ని చూసే వైసీపీలో నేతలు ఉంటున్నారు అని అంటున్నారు వైసీపీ గ్రాఫ్ కూడా నెమ్మదిగా పెరిగే అవకాశాలు ఉన్నాయని నాయకులు భావిస్తున్నారు. పార్టీని నమ్ముకుని ఉన్న వారికి అధినేత న్యాయం చేస్తారు అన్న ఆలోచనలో చాలా మంది ఉన్నారు. నిజానికి ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ దాకా కొందరు బిగ్ షాట్స్ మాజీ మంత్రులు సీనియర్ నేతలు అంతా పార్టీని వీడాలని ఒకనొక సమయంలో నిర్ణయం తీసుకున్నా ఎందుక



వెనకడుగు వేశారు. కొన్నాళ్ళ పాటు వారంతా మౌనంగా ఉన్నా ఇపుడిపుడే మీడియా ముఖం చూస్తున్నారు. ఆ విధంగా అధినేత కళ్ళల్లో పడి తాము యాక్టివ్ గా ఉన్నామని చెప్పుకోవడం ద్వారా వైసీపీలో అవకాశాలను అందుకోవాలని చూస్తున్నారు అని అంటున్నారు. ఏపీలో సరైన పోటీ ప్రతిపక్షం లేకపోవడమే వైసీపీకి ఒక విధంగా అడ్వాంటేజ్ గా చెబుతున్నారు. ఇష్టం ఉన్నా లేకపోయినా కూటమి కాకపోతే వైసీపీనే ఎంచుకోవాల్సి వస్తోంది అని అంటున్నారు. దాంతో వైసీపీకి పెద్ద ఇబ్బంది లేకుండా పోతోంది అని అంటున్నారు ఇక వైసీపీలో కొనసాగుతున్నారని నాయకులకు పదవులు ఇచ్చే సీన్ ఉంటుందా అన్నది కూడా ఒక ప్రశ్న. పార్టీకి పనికి వచ్చే వారు ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే ఈసారి టికెట్లు ఇస్తారని అంటున్నారు. జగన్ గతంలో ప్రతిపక్షంలో ఉన్నపుడు అందరూ పనిచేయడం చూశారు, అధికారంలో అయిదేళ్ళూ అంతా పార్టీలో హడావుడి చేయడమూ చూశారు, ఇపుడు విపక్షంలోకి వచ్చాక పార్టీని వీడి వెళ్ళిన వారు ఉన్నా సైలెంట్ గా గడిపిన వారినీ చూశారని అందువల్ల వైసీపీలో ఎవరు ఏమిటో జగన్ కి బాగా తెలుసు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే వైసీపీ నుంచి భారీ జంపింగులు అయితే జరిగేది ఇక మీదట ఉండబోదు అన్న భరోసా అయితే కనిపిస్తోంది అని అంటున్నారు.

# ధోనీ భవిష్యత్తుపై సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ కీలక ప్రకటన!

సీఎస్కేను ఐదు సార్లు ఛాంపియన్ గా నిలిపిన ధోనీ

జట్టులో ధోనీ ఏ పాత్రలో కొనసాగాలనుకున్నా తమకు అభ్యంతరం లేదన్న సీఈవో

ఏ నిర్ణయమైనా ధోనీ అభిప్రాయం పైనే ఆధారపడి ఉంటుందని స్పష్టీకరణ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ అనగానే అందరికీ గుర్తొచ్చే పేరు మహేంద్ర సింగ్ ధోనీ. సీఎస్కే అంటే ధోనీ, ధోనీ అంటే సీఎస్కే అనేంతలా ఆ జట్టుతో అతడి బంధం ముడిపడిపోయింది. అయితే, మోకాలి గాయం కారణంగా ధోనీ ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడలేకపోయాడు. దీంతో అతడి ఐపీఎల్ కెరీర్ ముగిసిపోయిందనే చర్చలు క్రికెట్ వర్గాల్లో జోరందుకున్నాయి. ఈ ఊహాగానాలపై సీఎస్కే జట్టు సీఈవో కాశీ విశ్వనాథన్ స్పందిస్తూ ఒక సంచలన ప్రకటన చేశారు. ధోనీ జట్టులో ఏ పాత్రలో కొనసాగాలనుకున్నా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, ఆ నిర్ణయం పూర్తిగా అతడి వ్యక్తిగత ఇష్టానికే వదిలేస్తున్నామని స్పష్టం చేశారు. "ధోనీ సీఎస్కేలో ఏ పాత్రలో ఉన్నా మాకు ఆనందమే. అతడు ఆటగాడిగా ఉంటాడా, కోచ్‌గా మారతాడా లేదా మెంటార్‌గా సేవలందిస్తాడా అనేది పూర్తిగా అతడి ఇష్టం. సీఎస్కేకు సంబంధించిన ఏ నిర్ణయమైనా ధోనీ అభిప్రాయం పైనే ఆధారపడి ఉంటుంది" అని సీఈవో వెల్లడించారు. ధోనీ ఇంకా తన రిటైర్మెంట్‌పై అధికారిక ప్రకటన చేయనప్పటికీ, వచ్చే సీజన్ నాటికి అతడు సీఎస్కే మేనేజ్‌మెంట్‌లో లేదా సపోర్ట్ స్టాఫ్‌లో కీలక బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందనే వార్తలకు ఈ వ్యాఖ్యలు మరింత బలాన్ని చేకూర్చాయి. ముఖ్యంగా, సీఎస్కే హెడ్ కోచ్ పదవికి ధోనీని మించిన అర్హుడు మరెవరూ లేరని మాజీలు కూడా అభిప్రాయపడుతున్నారు.

# సన్‌రైజర్స్ కథ ముగిసింది.. ఎలిమినేటర్‌లో రాజస్థాన్ ఘనవిజయం!

- ఐపీఎల్ 2026 ఎలిమినేటర్‌లో 47 పరుగుల తేడాతో ఓడిన సన్‌రైజర్స్
- క్వాలిఫయర్-2కి చేరిన రాజస్థాన్ రాయల్స్
- 29 బంతుల్లో 97 పరుగులతో చెలరేగిన వైభవ్ సూర్యవంశీ
- భారీ లక్ష్య ఛేదనలో తడబడిన హైదరాబాద్ బ్యాటింగ్ లైనప్
- టోర్నీ నుంచి నిష్క్రమించిన సన్‌రైజర్స్ హైదరాబాద్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రస్థానం ముగిసింది. బుధవారం చండీగఢ్‌లో జరిగిన కీలకమైన ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో 47 పరుగుల తేడాతో ఘోర పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడిన విధ్వంసకర ఇన్నింగ్స్‌కు, ఆ తర్వాత రాజస్థాన్ బౌలర్ల క్రమశిక్షణతో కూడిన ప్రదర్శన తోడవడంతో సన్‌రైజర్స్ ఫైనల్ ఆశలు గల్లంతయ్యాయి. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న సన్‌రైజర్స్ నిర్ణయం పూర్తిగా బెడిసికొట్టింది. రాజస్థాన్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఆరంభం నుంచే హైదరాబాద్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 29 బంతుల్లో 5 ఫోర్లు, 12 సిక్సర్లతో 97 పరుగులు చేసి పెను విధ్వంసం సృష్టించాడు. ఐపీఎల్ చరిత్రలోనే ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డును తృటిలో చేజార్చుకున్నాడు. అతని దూకుడుతో రాజస్థాన్ 8 ఓవర్లకే 125 పరుగులు చేసింది. ఆ తర్వాత వచ్చిన ధ్రువ్ జురెల్ (21 బంతుల్లో 50) కూడా మెరుపు అర్ధశతకంతో రాణించడంతో రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 243 పరుగుల భారీ స్కోరు సాధించింది.

భారీ లక్ష్య ఛేదనకు దిగిన సన్‌రైజర్స్ ఏ దశలోనూ విజయం దిశగా సాగలేదు. రాజస్థాన్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ పవర్‌ప్లేలోనే తన పదును చూపించాడు. అభిషేక్ శర్మ (0), ట్రావిస్ హెడ్ (17), ఇషాన్ కిషన్ (33) వంటి కీలక బ్యాటర్లను పెవిలియన్‌కు పంపి హైదరాబాద్‌ను కోలుకోలేని దెబ్బ తీశాడు. జట్టును ఆదుకుంటాడనుకున్న హెన్రిచ్ క్లాసెన్ (18) కూడా విఫలమయ్యాడు. నితీశ్ రెడ్డి (38), సలీల్ అరోరా (35) కాసేపు పోరాడినా ఫలితం లేకపోయింది. వరుసగా వికెట్లు కోల్పోవడంతో సన్‌రైజర్స్ ఇన్నింగ్స్ 19.2 ఓవర్లలో 196 పరుగుల వద్ద ముగిసింది. దీంతో రాజస్థాన్ రాయల్స్ ఘన విజయం సాధించి క్వాలిఫయర్-2 మ్యాచ్ కు అర్హత సాధించింది. ఈ నెల 29న జరిగే క్వాలిఫయర్-2 పోరులో రాజస్థాన్... గుజరాత్ టైటాన్స్ తో తలపడనుంది.

# ఐపీఎల్ లవర్స్‌కు షాకింగ్ న్యూస్.. వేసవి క్రికెట్ పండగ ఇక ఉండదా..?



**హైదరాబాద్ పెన్ పవర్:** సమ్మర్ అనగానే క్రికెట్ ప్రియులకు మొదటగా గుర్తుకు వచ్చేది ఐపీఎల్. సమ్మర్?లో రెండు నెలల పాటు ఐపీఎల్?ను తెగా ఎంజాయ్ చేస్తారు క్రికెట్ అభిమానులు. అయితే, ఎండకాలంలో క్రికెట్ లవర్స్?ను ఉర్రూతలూగించే ఐపీఎల్ విండోను బీసీసీఐ మార్చబోతుందా..? ఇకపై వేసవి క్రికెట్ పండగ ఉండదా..? అంటే కొన్ని వర్గాల నుంచి అవుననే సమాధానం వినిపిస్తోంది.

టోర్నీ షెడ్యూల్ మార్పుపై ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రముఖ స్పోర్ట్స్ న్యూస్ ఛానల్ స్పోర్ట్‌స్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ధుమాల్ మాట్లాడుతూ.. వేసవిలో అధిక వేడి, ఆటగాళ్ల అలసటపై ఆందోళనల కారణంగా ఐపీఎల్ టోర్నీ విండోను మార్చి-మే నుంచి సెప్టెంబర్-అక్టోబర్‌కు మార్చడాన్ని బీసీసీఐ పరిశీలించవచ్చని అన్నారు.

అయితే, ప్రస్తుత విండోను మార్చడానికి తక్షణ అవసరం ఏమీ లేదని.. విండో మార్పు నిర్ణయాన్ని లీగ్ ప్రసార భాగస్వామితో సంప్రదించి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇంకా దీనిపై తుది నిర్ణయం తీసుకోలేదని.. వాణిజ్య, నిర్వహణాపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని టోర్నమెంట్ సమయాన్ని పునఃపరిశీలించే అవకాశం ఉందన్నారు.

ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి సాంప్రదాయకంగా ఏప్రిల్, మే రెండు నెలల వ్యవధిలో జరుగుతూ వస్తోంది. అయితే, 2028 నుంచి మ్యాచ్‌ల సంఖ్యను పెంచే అవకాశాన్ని కూడా ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ పరిశీలిస్తుండటంతో, షెడ్యూలింగ్‌పై మళ్లీ చర్చ మొదలైంది. ప్రస్తుతం.. ఐపీఎల్‌లో రెండు నెలల వ్యవధిలో 10 జట్ల మధ్య 74 మ్యాచ్‌లు జరుగుతాయి.

# సింగం 4: అక్కడ దేవగన్ - ఇక్కడ సూర్య భారీ ప్లాన్స్!



బాలీవుడ్ లో అత్యంత విజయవంతమైన యాక్షన్ ఫ్రాంచైజీలలో ఒకటైన -సింగం- సిరీస్ నుండి తదుపరి భాగం -సింగం 4- రూపొందుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. రోహిత్ శెట్టి కాప్ యూనివర్స్ లో భాగంగా గత ఏడాది దీపావళికి విడుదలైన -సింగం అగైన్- చిత్రం బాక్సాఫీస్ వద్ద దాదాపు 390 కోట్ల వసూళ్లతో ఒక మోస్తరు విజయాన్ని అందుకుంది. అయితే ఆ చిత్రానికి వచ్చిన మిశ్రమ స్పందనను దృష్టిలో ఉంచుకుని దర్శకుడు రోహిత్ శెట్టి- యాక్షన్ స్టార్ అజయ్ దేవగన్ ఈ నాలుగో భాగాన్ని మరింత పకడ్బందీగా పాత -సింగం- తరహా బ్రాండ్ మాస్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి స్క్రిప్ట్ పనులను వేగవంతం చేశారు.

గత చిత్రం -సింగం అగైన్- లో మల్టీస్టారర్ కాన్సెప్ట్..ఎక్కువ మంది హీరోల క్రాస్‌ఓవర్ల కారణంగా బాజీరావ్ సింగం - ఒరిజినల్ అగ్రెసివ్ క్యారెక్టరైజేషన్ కొంత తగ్గిందనే విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ ఫీడ్‌బ్యాక్‌ను సీరియస్‌గా తీసుకున్న అజయ్ దేవగన్ ఈసారి -సింగం 4- లో ప్రేక్షకులు కోరుకునే ప్యూర్ మాస్ యాక్షన్, పవర్‌ఫుల్ డైలాగ్స్ .. ఒళ్లు గగుర్పొడిచే ఒరిజినల్ సింగం మార్కు ఇంటెన్సిటీని మళ్లీ పునరావృతం చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈసారి సోలో హీరో ఎలిమెంట్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత లభించే అవకాశం ఉంది.

మరోవైపు సౌత్ సినీ ఇండస్ట్రీలోనూ ఇదే టైటిల్‌తో మరో క్రేజీ ప్రాజెక్ట్ సిద్ధమవుతుండటం విశేషం. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రధాన పాత్రలో డైరెక్టర్ హరి తెరకెక్కించిన సూపర్ హిట్ తమిళ -సింగం- ఫ్రాంచైజీకి కూడా నాలుగో భాగం -సింగం 4- కోసం కథాచర్చలు జరుగుతున్నట్లు దర్శకుడు హరి అధికారికంగా ధృవీకరించారు. గతంలో ప్రాంతీయ, అంతర్జాతీయ నేరగాళ్లను వేటాడిన దురైసింగం పాత్రను ఈసారి మరింత వైవిధ్యమైన కథనంతో.. సరికొత్త విలన్లతో పాన్-ఇండియా రేంజ్‌లో భారీ స్థాయిలో ఆవిష్కరించేందుకు సూర్య, హరిల కాంబో సన్నాహాలు చేస్తోంది.

అక్కడ బాలీవుడ్ లో సింగం ఫ్రాంఛైజీలో కొత్త సినిమా దేవగన్ తో తెరకెక్కిస్తే.. అదే సమయంలో సూర్య హీరోగా హరి కూడా బరిలో దిగుతున్నారు గనుక ఈ ఫ్రాంఛైజీ మరోసారి నిరంతరం వార్తల్లో నిలవడం ఖాయం. దానికి తగ్గట్టే ఫ్యాన్స్ లోను అంతే క్రేజ్ నెలకొంటుంది. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించిన పూర్తి కాస్టింగ్, అఫీషియల్ అనౌన్స్‌మెంట్.. షూటింగ్ షెడ్యూల్ వివరాలు త్వరలోనే వెల్లడి కానున్నాయి.



**ఆకర్షణీయమైన క్లోజ్-అప్ గ్లామ్‌తో మెరిసే టీల్ లుక్‌లో శ్రీముఖి అబ్బురపరుస్తుంది**



**సన్యా మల్హోత్రా అద్భుతమైన బ్లాక్ స్టూడియో ఫోటోషూట్‌లో రా గ్లామర్‌ను ప్రదర్శించింది**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com